మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 20-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 52 Issue: 52

20 ఆగస్టు 2026 - గురువారంశ్రీ పరాభవ నామ సంవత్సరందక్షిణాయనం - వర్ష ఋతువుశ్రావణ మాసం - శుక్లపక్షంసూర్యోదయం - ఉ. 6:03సూర్యాస్తమయం - సా. 6:35తిథిఅష్టమి రా. 9:20 వరకుతరువాత నవమిసంస్కృత వారంబృహస్పతి వాసరంనక్షత్రంవిశాఖ ఉ. 9:02 వరకుతరువాత అనురాధయోగంఇంద్ర తె. 4:15ఐ వరకుకరణంవిష్టి ఉ. 8:16 వరకుబవ రా. 9:20 వరకువర్జ్యం. 1:35 నుండి మ. 3:22 వరకుదుర్ముహూర్తం. 10:14 నుండి ఉ. 11:04 వరకుమ. 3:14 నుండి సా. 4:04 వరకురాహుకాలం. 1:53 నుండి మ. 3:27 వరకుయమగండం. 6:03 నుండి ఉ. 7:37 వరకుగుళికాకాలం. 9:11 నుండి ఉ. 10:45 వరకుబ్రహ్మముహూర్తంతె. 4:27 నుండి తె. 5:15 వరకుఅమృత ఘడియలురా. 12:16 నుండి రా. 2:03 వరకుఅభిజిత్ ముహూర్తం. 11:54 నుండి మ. 12:44 వరకుగమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

# డిజిటల్ లావాదేవీలపై చార్జీ!

**బీఎస్‌బీడీ ఖాతాలపై ఎస్బీఐ కొత్త రూల్.. అక్టోబర్ 1 నుంచి అమల్లోకి**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బీఎస్బీడీ) ఖాతా ఉన్నవారికి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేసే విషయంలో ఎస్‌బీఐ కొన్ని మార్పులు చేసింది. కొత్త నిబంధనలు 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటివరకు బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాదారులకు నెలలో మొదటి నాలుగు క్యాష్ విత్‌డ్రాలు ఉచితంగా ఉండేవి. ఈ పరిమితి దాటిన తర్వాతే ఛార్జీలు వర్తించేవి.

న్యూఢిల్లీ: కొత్త రూల్స్ ప్రకారం.. అక్టోబర్ 1 నుంచి కూడా మొదటి నాలుగు విత్‌డ్రాలు ఉచితంగానే ఉంటాయి. కానీ ఆ తర్వాత చేసే ప్రతి క్యాష్ విత్‌డ్రాకు రూ.15తో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడే అసలు మార్పు వచ్చింది. గతంలో ఈ నాలుగు ఉచిత లావాదేవీలను లెక్కించేటప్పుడు కొన్ని డిజిటల్ లావాదేవీలను మినహాయించేవారు. ఇప్పుడు ఎస్‌బీఐ ఆ మినహాయింపును తొలగించింది. దీంతో ఖాతాదారులు తమ నెలవారీ -2 వ పేజీలో...




# 9 సిమ్ కార్డులే ఉండాలి!

**సిమ్ కార్డు నిబంధనలు కఠినతరం**

**ఇకపై ఫొటో చెక్ తప్పనిసరి.. పరిమితికి మించి ఉంటే కొత్త కనెక్షన్ క్యాన్సిల్**

డిజిటల్ మోసాలు, ఆర్థిక నేరాలకు అడ్డు కట్ట వేసేందుకు కేంద్ర టెలికం విభాగం (డీఓటీ) కీలక నిర్ణయం తీసుకుంది. సిమ్ కార్డుల జారీ, వినియోగంపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఇందులో భాగంగా, ఒక వ్యక్తి గరిష్ఠంగా 9 సిమ్ కార్డులు మాత్రమే కలిగి ఉండాలన్న నిబంధనను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించింది.

న్యూఢిల్లీ: ఈ మేరకు ఆగస్టు 17న టెలికం కంపెనీలకు సర్క్యులర్ జారీ చేసింది. ఈ నూతన నిబంధనల అమలు కోసం 'డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్' (డీఐపీ) అనే ప్రత్యేక వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఎవరైనా తొమ్మిది సిమ్ కార్డుల పరిమితిని మించితే, వారి ఫొటోను ఈ ప్లాట్‌ఫామ్‌లో -2 వ పేజీలో...






పోలీస్ అభ్యర్థుల

# వివరాలకు యూనిక్ ఐడీ

**టీఎస్ఎల్పీఆర్బీ కొత్త విధానం**

**వివాదాలకు తావు లేకుండా నిర్ణయం**

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈవార్తలు): తెలంగాణలో పోలీస్ ఉద్యోగ నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కీలక చర్యలు చేపడుతోంది. పోటీ పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలకు ఏమాత్రం తావు లేకుండా ప్రతి అభ్యర్థి నియామక ప్రక్రియకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఒకే చోట నిక్షిప్తం చేయాలని డిసైడ్ -2 వ పేజీలో...

# రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కినయా?

## రేవూరికి టికెట్ ఎలా ఇస్తవ్?

**అసలు టికెట్ ఇచ్చేందుకు రేవంత్ ఎవరు?.. పరకాలలో నేనే పోటీ చేస్తా**

**గెలిచి తీరుతా: కొండా సుస్మిత.. కౌంటర్లు ఇస్తే ప్రెస్‌మీట్ పెట్టి రచ్చ చేస్తానని హెచ్చరిక**

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కొత్త కలకలం రేపాయి. కొండా సుస్మిత తన సోషల్ మీడియా పోస్టులు, వ్యాఖ్యల ద్వారా వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోయినా ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి గెలుస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు లేదా మరెవరైనా ప్రచారానికి వచ్చినా తానే గెలుస్తానని సుస్మిత వ్యాఖ్యానించారు.



వరంగల్, ఆగస్టు 19 (ఈవార్తలు): సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో స్పందించిన సుస్మిత.. ముఖ్యమంత్రి అయిన తర్వాత "కళ్లు నెత్తికి ఎక్కాయా?" అంటూ ప్రశ్నించారు. గతంలో రేవంత్‌రెడ్డికి తమ తండ్రి చేసిన సహాయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు తమ కుటుంబం కనిపించడం లేదా? అని నిలదీశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఇప్పుడే రాజీనామా చేయించే దమ్ము ఉందా? అని సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రచారం చేసినా రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఓడిపోతారని సుస్మిత వ్యాఖ్యానించారు. తనను మరింతగా టార్గెట్ చేస్తే రేవంత్ కుటుంబానికి సంబంధించిన స్కాములన్నింటినీ బయటపెడతానని హెచ్చరించారు. తన తమ్ముడికి సంబంధించిన రూ.200 కోట్ల భూ కుంభకోణం గురించి మాత్రమే తాను ప్రస్తుతం మాట్లాడానని, తనకు కౌంటర్ ఇస్తే మరిన్ని విషయాలు బయటపెడతానని పేర్కొన్నారు. అంతేకాకుండా 80 ఏళ్ల వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమంటూ సుస్మిత చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. అటు.. మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా పరకాల నియోజకవర్గంలో వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్న తరువాయి 2 వ పేజీలో...



# 22ఏ.. 10 మంది లాయర్లు

**బాధితులకు అండగా బీఆర్ఎస్**

**తెలంగాణ భవన్‌లో న్యాయ సహాయ కేంద్రం**

**ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు**

22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడంతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఉప సభాపక్ష నేత తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో పది మంది న్యాయవాదులతో న్యాయ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈవార్తలు): న్యాయవాది కళ్యాణ్‌ను 812535604 నంబర్‌లో సంప్రదిస్తే సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. తెలంగాణ భవన్‌లో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 22ఏ బాధితులతో హరీశ్‌రావు ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను విన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 22ఏ పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో బాధితులకు అండగా నిలిచి, సమస్య పరిష్కారమయ్యే తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,497 |
| వెండి (కిలో): | రూ.2,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,268 |

# ప్రజల సొమ్ము రాళ్ల పాలు

**ఉచిత పథకాలకు ప్రజాధనం వృథా**

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై హైకోర్టు**

తెలంగాణలో ఎంతో ప్రాముఖ్యం కలిగిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు, విచారణకు సంబంధించి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలో చట్టబద్ధత లేని పథకాల కోసం ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేయడంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.



హైదరాబాద్, ఆగస్టు 19 (ఈవార్తలు): ప్రజాధనాన్ని కేవలం ఉచిత పథకాలకే కాకుండా, నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించేందుకు ఉపయోగించి, దానిద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తే బాగుంటుంది కదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిమిత్తం తరువాయి 2 వ పేజీలో...

# కవితే కింగ్ మేకర్

**కేసీఆర్ ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి**

**ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి**

ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి తెలంగాణ రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలుగు రాష్ట్రాల రాజకీయాలతోపాటు.. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై జోస్యం చెప్పారు. తమిళనాడులో విజయ్ ప్రభుత్వం వచ్చే ఏడాది కూలిపోతుందని ఆయన జోస్యం చెప్పారు.




హైదరాబాద్, ఆగస్టు 19 (ఈవార్తలు): 2029లో జరగనున్న ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ ఉంటుందన్న వేణుస్వామి.. తెలంగాణలో మాత్రం ఆ పరిస్థితి ఉండదన్నారు. 2027 జూన్ నుంచి జగన్‌కు సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కేసీఆర్, -2 వ పేజీలో...



# జమ్మూకశ్మీర్ భారత్‌దే

**అమెరికా రాయబారి సెర్గియో గోర్**

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో -2 వ పేజీలో...

## విశ్వవాణి



పిత్తాశయం లేకపోయినా మనిషి జీవించడానికి ఎలాంటి ఆటంకం ఉండదు. పిత్తాశయాన్ని శస్త్రచికిత్స ద్వారా తొలగించిన తర్వాత కూడా కాలేయం పిత్తరసాన్ని ఉత్పత్తి చేస్తూనే ఉంటుంది. అయితే అది పిత్తాశయంలో నిల్వ కాకుండా నేరుగా చిన్నపేగులోకి ప్రవహిస్తుంది. చాలామంది శరీరం ఈ మార్పుకు కొన్ని వారాలు లేదా నెలల్లో అలవాటు పడుతుంది.

# 1,383 జెండాలతో గిన్నిస్ రికార్డు!

**అమెరికాలో భారతీయుల అరుదైన ఘనత**

పార్సిప్పనీ: అమెరికా- న్యూజెర్సీలోని పార్సిప్పనీ పట్టణంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. మొత్తం 1,383 అమెరికా జెండాలను ఫ్లాగ్‌పోల్స్‌పై ఏర్పాటు చేసి భారీ స్థాయిలో '250' అనే సంఖ్యను రూపొందించడం ద్వారా తరువాయి 2 వ పేజీలో...




# 27 సార్లు పొడిచి చంపారు!

**జల్సాలు, డబ్బు కోసమే హత్య.. మైనర్ విద్యార్థులే నిందితులు**

**ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు**

నల్గొండ, ఆగస్టు 19 (ఈవార్తలు): నల్గొండ జిల్లాలో సంచలనం సృష్టించిన స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. విలాసాలకు అలవాటు పడిన ఇద్దరు మైనర్ విద్యార్థులే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు నిర్ధారించారు. నిందితుల్లో ఒకరు ఆమెను ఏకంగా 27 సార్లు కత్తితో పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. బుధవారం -2 వ పేజీలో...



## రాశి ఫలాలు



20.8.2026

**మేషం:** పనులు ముందుకు సాగక నిరాశ చెందుతారు. వృథా ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి.

**వృషభం:** సంఘంలో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. చేపట్టిన పనులలో పురోగతి సాధిస్తారు. మిత్రుల నుంచి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఇతరులకు సహాయం అందిస్తారు.

**మిథునం:** చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ముఖ్యమైన నిర్ణయాలలో తొందరపాటు నిర్ణయాలు ఇబ్బంది కలిగిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. దైవ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. సంతానం విద్యా విషయాలు అనుకూలిస్తాయి.

**కర్కాటకం:** చేపట్టిన పనులలో ప్రతిబంధకాలు తప్పవు. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. బంధు మిత్రులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగక చికాకులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. సోదరులతో కలహ సూచనలు ఉన్నవి. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొంత గందరగోళం ఉంటుంది.

**కన్య:** నూతన మిత్రుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థిరాస్తి కొనుగోలు విషయంలో ఉన్న ఆటంకాలు తొలగి, అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు అనుకూలిస్తాయి.

**తుల:** సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు పరిష్కారమవుతాయి.

**వృశ్చికం:** వ్యయ ప్రయాసలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. బంధువులతో ఊహించిన వివాదాలు కలుగుతాయి. ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది తప్పదు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు కొంత మందగిస్తాయి.

**ధనస్సు:** ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహ పరుస్తాయి. దూర బంధువులతో వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. మిత్రులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

**మకరం:** నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. విద్యార్థుల పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత ఉత్సాహవంతంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు పరిష్కారమవుతాయి.

**కుంభం:** ముఖ్యమైన వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృథా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయాలి. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి.

**మీనం:** చేపట్టిన పనులను మరింత ఉత్సాహంగా పూర్తి చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

# డిజిటల్ లావాదేవీలపై చార్జీ!

**మొదటి పేజీ తరువాయి**

విత్‌డ్రాలను కాస్త జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. బీఎస్‌బీడీ అంటే 'బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్'. ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్నవారు కూడా సులభంగా బ్యాంకింగ్ సేవలు పొందేలా ఈ ఖాతాలను రూపొందించారు. ఈ ఖాతాలో పెద్ద ప్రయోజనం ఏంటంటే.. మినిమమ్ బ్యాలెన్స్ ఉంచాల్సిన అవసరం లేదు. అంటే.. ఖాతాలో ఎప్పుడూ ఒక నిర్దిష్ట మొత్తాన్ని తప్పనిసరిగా ఉంచాల్సిన భారం ఉండదు. అయితే సాధారణ సేవింగ్స్ ఖాతాలతో పోలిస్తే కొన్ని సదుపాయాలు పరిమితంగా ఉంటాయి. ఎస్‌బీఐ బీఎస్‌బీడీ ఖాతాదారులకు సాధారణంగా చెక్‌బుక్ సదుపాయం ఉండదు. నగదు అవసరమైతే బ్రాంచ్‌లో విత్‌డ్రా ఫారమ్



ఉపయోగించవచ్చు లేదా ఏటీఎం ద్వారా డబ్బు తీసుకోవచ్చు. అలాగే ఖాతాదారులకు రూపే ఏటీఎమ్-కమ్-డెబిట్ కార్డు ఇస్తారు. ఈ కార్డుపై వార్షిక మెయింటెనెన్స్ ఛార్జీ ఉండదు. బీఎస్‌బీడీ ఖాతా తెరిచే విషయంలో ఎస్‌బీఐ మరో నిబంధన కూడా పెట్టింది. ఇప్పటికే ఎస్‌బీఐలో సాధారణ సేవింగ్స్ ఖాతా ఉన్న వ్యక్తి బీఎస్‌బీడీ ఖాతా ఓపెన్ చేస్తే.. రెండు ఖాతాలను ఒకేసారి కొనసాగించడానికి వీలు ఉండదు. బీఎస్‌బీడీ అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత అప్పటికే ఉన్న సేవింగ్స్ ఖాతాను 30 రోజుల్లోపు క్లోజ్ చేయాల్సి ఉంటుంది. నెలకు నాలుగు ఉచిత క్యాష్ విత్‌డ్రాల విషయంలో కేవలం ఎస్‌బీఐ ఏటీఎంలను మాత్రమే కాకుండా ఇతర బ్యాంకుల ఏటీఎంల నుంచి చేసే విత్‌డ్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే.. బ్రాంచ్‌లో నగదు తీసుకోవడం, ఏఈపీఎస్ ద్వారా చేసే క్యాష్ విత్‌డ్రాలు కూడా ఈ ఉచిత పరిమితిలోకి వస్తాయి. అంటే.. ఒక నెలలో ఏటీఎం, బ్రాంచ్, ఏఈపీఎస్ ద్వారా కలిపి నాలుగు ఉచిత విత్‌డ్రాలు పూర్తయ్యాక.. తదుపరి క్యాష్ విత్‌డ్రాలకు ఛార్జీ పడే అవకాశం ఉంటుంది.

# 22ఏ.. 10 మంది లాయర్లు

**మొదటి పేజీ తరువాయి**

వరకు పోరాడుతామని చెప్పారు. ప్రజలు భయపడి 20, 30 శాతం మధ్యవర్తిత్వ రుసుములు చెల్లించవద్దని, ఆస్తులను తక్కువ ధరలకు విక్రయించుకోవద్దని సూచించారు. ప్రభుత్వ అధికారులు, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలుగా కూడా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ తప్పిదం వల్ల నిషేధిత జాబితాలో చేరిన భూములపై ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, ప్రభుత్వం స్వయంగా పరిశీలించి ఆంక్షలను తొలగించాలని డిమాండ్ చేశారు. గతంలో అనుమతులు పొందిన స్థలాలు, ఇళ్లను సైతం ఇప్పుడు 22ఏ జాబితాలో చేర్చడంపై హరీశ్‌రావు ప్రశ్నించారు. బుద్వేల్ గ్రామంలోని 282, 283, 284 సర్వే నంబర్లలోని సుమారు 30 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి, ఆ తర్వాత మళ్లీ చేర్చిన వ్యవహారంపై విచారణ జరపాలని కోరారు. శేరిలింగంపల్లి పరిధిలోని 20/1, 21 సర్వే నంబర్లకు సంబంధించిన భూముల విషయంలోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అమీన్‌పూర్ కేఎస్ఆర్ కాలనీలో సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ సుమారు 500 ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. సంగారెడ్డి సమీపంలోని భూముల విషయంలోనూ ఒకసారి నిషేధిత జాబితా నుంచి తొలగించి, తిరిగి చేర్చినట్లు ఆరోపించారు. 22ఏ వ్యవహారంపై ప్రభుత్వం భిన్నమైన ప్రకటనలు చేస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. ఒక్క ఎకరం కూడా 22ఏలో చేర్చలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారని, మరోవైపు అధికారులు పొరపాటు జరిగిందని చెబుతున్నారని పేర్కొన్నారు. యాదాద్రి జిల్లాలో సుమారు 40 వేల ఎకరాలు 22ఏ జాబితాలో చేర్చినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లక్షలాది మంది ప్రజల ఆస్తులకు సంబంధించిన ఈ వ్యవహారంపై నేర పరిశోధన విభాగం లేదా నిఘా సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి సంబంధం లేకపోతే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి తొలగించాలని కోరారు. భూ భారతి అంతర్జాల వేదికలో హైదరాబాద్ జిల్లా వివరాలు అందుబాటులో లేకపోవడంపైనా హరీశ్‌రావు అనుమానం వ్యక్తం చేశారు. 2008లోనే భూ పరిమితుల రద్దు జరిగినప్పటికీ, అప్పటి అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్న వారిని ఇప్పుడు భూ పరిమితి భూముల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

# కవితే కింగ్ మేకర్

**మొదటి పేజీ తరువాయి**

రేవంత్ రెడ్డి తదితర నేతల జాతకాన్ని సైతం ఆయన విశ్లేషించారు. 2027 జూన్ 2 నుంచి శని మేష రాశిలోకి ప్రవేశిస్తుందన్న వేణుస్వామి.. దాని ప్రభావంతో కేసీఆర్‌కు ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. కేటీఆర్ జాతకంలో 2027 జూన్ 2 నుంచి అర్ధాష్టక శని మొదలవుతుందని.. కవితకు కూడా ఏలినాటి శని వస్తోందన్న వేణుస్వామి.. వారి జాతకం ప్రభావం వల్ల కేసీఆర్ ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కేటీఆర్‌కు న్యాయపరమైన ఇబ్బందులు ఎదురై జైలుకు వెళ్లే అవకాశం కనిపిస్తోందన్నారు. 'రేవంత్ రెడ్డి జాతకంలో ఇప్పుడు కష్టాలు ఉన్నాయి. అయినా సరే ఆయన సూపర్ స్టార్‌గా బతుకుతున్నడు. 2027 నుంచి ఆయన జాతకం ఇంకా బాగుంది. ఆయనకు గజకేసరి యోగం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 2028లో ఎవరికీ వన్ సైడ్ ఉండదు. ముక్కోణపు పోటీలో ఎవరు గెలిచినా 60-70 సీట్లే రావచ్చు. ఏపీలో వార్ వన్ సైడ్ అవుతుంది. ఏ పార్టీ గెలిచినా 80 శాతానికిపైగా సీట్లు వస్తాయి. ఎన్నికల వరకు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారవు. కానీ సంచలనాలు ఉంటాయి. తెలంగాణలో ఎన్నికల లోపు రెండు మూడు కొత్త పార్టీలు వస్తాయి. ఆంధ్రాలో కూడా కొత్త పార్టీలు వచ్చే అవకాశం ఉంది. తెలంగాణలో కవిత ఎఫెక్ట్ కచ్చితంగా ఉంటుంది. ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేయాలనేది కవితపై ఆధారపడి ఉంటుంది. 20-30 సీట్లలో ఆమె పార్టీ ప్రభావం చూపుతుంది. కవిత పార్టీకి 500-5000 సీట్లు వచ్చే నియోజకవర్గాలు 20-30 ఉండొచ్చు" అని వేణుస్వామి పేర్కొన్నాడు.

### విజయ్ జ్యోతిష్యుడితో కవిత భేటీ

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత , తమిళనాడు సీఎం జ్యోతిష్యుడు రాధన్ పండిట్ వెట్రివెల్ భేటీ ఆసక్తికరంగా మారింది. రాధన్ హైదరాబాద్‌లో కవిత ఇంటికి వెళ్లి కలిశారు.. ఆయన్ను కవిత, తన కుమారుడితో కలిసి సత్కరించారు. చాలామంది రాజకీయ నేతలు పండితులు, జ్యోతిష్యుల్ని నమ్ముతుంటారు.. వారు నిర్ణయించిన ముహూర్తాల్లోనే పార్టీ కార్యాలయాలు ప్రారంభించడం, రాజకీయపరమైన నిర్ణయాలు తీసుకోవడం, ఎన్నికల సమయంలో నామినేషన్లు వేయడం, ప్రత్యేక పూజలు చేయించడం వంటి వాటి కోసం జ్యోతిష్యుల్ని సంప్రదిస్తుంటారు. కవిత కూడా తమిళనాడు సీఎం విజయ్ జ్యోతిష్యుడ్ని సలహాల కోసం సంప్రదించారా? అనే చర్చ జరుగుతోంది. రాధన్ తమిళనాడులో విజయ్ ముఖ్యమంత్రి అవుతారని ముందు నుంచి చెబుతున్నారు.. ఆయన చెప్పినట్లుగానే జరిగింది. తమిళనాడు ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ సమయంలో దాదాపు అన్ని సర్వే సంస్థలు టీవీకే అధికారంలోకి వచ్చే అవకాశం లేదని చెప్పగా.. తాము ఎగ్జిట్ పోల్స్ పట్టించుకోమని.. టీవీకే పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని.. విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు. అంతేకాదు గతంలో తమిళనాడుకు చెందిన నేతల జాతకాల గురించి రాధన్ చెప్పారు.. ఆయన చెప్పినట్లే జరిగింది.

# జమ్మూకశ్మీర్ భారత్‌దే

**మొదటి పేజీ తరువాయి**

పర్యటిస్తున్న తొలి అమెరికా రాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, "భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం" అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు.

# ప్రజల సొమ్ము రాళ్ల పాలు

**మొదటి పేజీ తరువాయి**

భూములు కోల్పోయిన భూ బాధితుల సమస్యల పట్ల కూడా న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భూసేకరణ ప్రక్రియలో సరైన పరిహారం, న్యాయం అందక అనేకమంది బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని గుర్తుచేసింది. ఒకవైపు నిరుపేద భూ బాధితులకు న్యాయం చేయడంలో జాప్యం జరుగుతుండగా, మరోవైపు సంక్షేమ పథకాలకు భారీగా నిధులు వెచ్చించడంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. భూ బాధితుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరాలను సమర్పించాలని సూచించింది. ఇదే సమయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఉన్న స్టేను ఎత్తివేసి, నిలిచిపోయిన లబ్ధిదారులకు సహాయం అందించేలా వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టును కోరారు. పేద వర్గాల వివాహాలకు ఆర్థిక సాయం అందించే ఈ పథకాలు ఎంతో మందికి ఉపయోగపడుతున్నాయని వివరించారు. ఈ క్రమంలో భూ బాధితులకు సంబంధించిన పరిహారం, ఇతర అంశాలపై ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని గురువారం కల్లా తెలియజేయాలని ఆదేశిస్తూ ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

# 27 సార్లు పొడిచి చంపారు!

**మొదటి పేజీ తరువాయి**

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి ఇంట్లో చోరీ చేసేందుకు ఇద్దరు విద్యార్థులు పథకం రచించారు. అందులో ఒకరు మాస్క్ ధరించి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. అయితే, ప్రమాదవశాత్తు మాస్క్ జారిపోవడంతో రూపారెడ్డి అతడిని గుర్తుపట్టారు. దీంతో భయాందోళనకు గురైన నిందితుడు, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. 27 సార్లు పొడిచి చంపిన అనంతరం, ఆమె ఫోన్‌ను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ కేసు దర్యాప్తు కోసం పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సుమారు 70 సీసీటీవీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఎస్పీ తెలిపారు. పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత గైర్హాజరైన వారిలో ఇద్దరు విద్యార్థులు విపరీతంగా డబ్బు ఖర్చు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. గతంలో హాస్టల్‌లో ఉన్న సమయంలో నిందితుడి వద్ద నగదు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి అతడిని మందలించారు. అప్పటి నుంచి ఆమెపై కక్ష పెంచుకున్న నిందితుడు, ప్రధానంగా డబ్బు కోసమే ఈ హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది.

# 1,383 జెండాలతో గిన్నిస్ రికార్డు!

**మొదటి పేజీ తరువాయి**

'లార్జెస్ట్ ఫ్లాగ్‌పోల్ నంబర్' విభాగంలో కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆగస్ట్ 15వ తేదీన పార్సిప్పనీ, న్యూజెర్సీలోని వెటరన్స్ మెమోరియల్ పార్క్‌లో ఈ గిన్నిస్ రికార్డ్ కార్యక్రమం నిర్వహించారు. అమెరికా జెండాలతో రూపొందించిన భారీ 250 సంఖ్య చుట్టూ భారత త్రివర్ణ పతాకాలను ఏర్పాటు చేశారు. భారత్, అమెరికా దేశాల చారిత్రక సంబంధాలు, ఇరు దేశాల స్వాతంత్ర్య వేడుకలను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ రికార్డు ప్రదర్శనను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు పరిశీలించి ధ్రువీకరించారు. ఆ తర్వాత అధికారిక గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అడ్జుడికేటర్ రికార్డు సర్టిఫికెట్‌ను ఎఫ్ఐఏ నాయకులు అందజేశారు. దీంతో ఈ కార్యక్రమం భారతీయ-అమెరికన్ సమాజానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

# 9 సిమ్ కార్డులే ఉండాలి!

**మొదటి పేజీ తరువాయి**

అప్‌లోడ్ చేస్తారు. ఆగస్టు 23 నుంచి ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. టెలికం కంపెనీలు కొత్త సిమ్ జారీ చేసే ముందు కస్టమర్ ఫొటోను ఈ డీఐపీ డేటాతో తప్పనిసరిగా సరిపోల్చుకోవాలి. ఒకవేళ పరిమితికి మించి సిమ్ కార్డులు ఉన్నట్లు తేలితే, సదరు వ్యక్తికి కొత్త సిమ్ జారీని నిరాకరించాలి. ఆగస్టు 24 నుంచి టెలికం ఆపరేటర్లు ఈ డీఐపీ వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు నవీకరించాల్సి ఉంటుంది. నవంబర్ 30 నాటికి ఈ ప్రక్రియ అంతా రియల్ టైమ్‌లో పనిచేసేలా చూడాలని డీఓటీ స్పష్టం చేసింది. నిర్ణీత పరిమితికి మించి సిమ్ కార్డులు కలిగి ఉన్న వినియోగదారులు వాటిని స్వచ్ఛందంగా సరెండర్ చేయాలని సూచించింది. లేనిపక్షంలో, సంబంధిత టెలికం కంపెనీలే వాటిని నిలిపివేస్తాయి

# పోలీస్ అభ్యర్థుల వివరాలకు యూనిక్ ఐడీ

**మొదటి పేజీ తరువాయి**

అయింది. అందులో భాగంగా ప్రతి అభ్యర్థికి ప్రత్యేకమైన యూనిక్ ఐడీని కేటాయిస్తోంది. దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థి ఎదుర్కొనే ప్రతి దశకు సంబంధించిన సమాచారాన్ని ఈ ఐడీలో నమోదు చేయనున్నారు. అభ్యర్థి ఉద్యోగానికి ఎంపికైనప్పటికీ, ఏదైనా దశలో పోటీ నుంచి తప్పుకున్నప్పటికీ అతడి లేదా ఆమెకు సంబంధించిన పూర్తి వివరాలు భద్రంగా ఉండేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. ఇందులో ఫామ్-ఏ, ఫామ్-బీతో కూడిన ప్రత్యేక ప్రొఫార్మాను సిద్ధం చేస్తున్నారు. యూనిఫాం సర్వీసుల నియామకాల్లో రాత పరీక్షతో పాటు శారీరక కొలతలు, శారీరక సామర్థ్య పరీక్షలు కూడా కీలకంగా ఉండనున్నాయి. ముఖ్యంగా పీఎంటీ, పీఈటీల నిర్వహణలో అభ్యర్థుల అర్హతలను కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుంది.

# రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కినయా?

**మొదటి పేజీ తరువాయి**

సమయంలో సుస్మిత తన ఇన్‌స్టాగ్రామ్‌లో "పరకాల అప్‌కమింగ్ ఎమ్మెల్యే" అంటూ స్టోరీ పెట్టడం మరింత ఆసక్తిని రేపింది. ఇటీవల కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మిత కత్తితో కేక్ కట్ చేసిన దృశ్యాలు కూడా వైరల్ అయ్యాయి.

### రేవూరి ప్రకాశ్‌రెడ్డి కౌంటర్

సుస్మిత వ్యాఖ్యలపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పందించారు. సమయం వచ్చినప్పుడు ఆమెకు సరైన సమాధానం ఇస్తానని, ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, అభ్యర్థుల ఎంపికకు పార్టీకి కొన్ని విధివిధానాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గ పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేలను ప్రోత్సహించడం సాధారణమేనని, సుస్మిత వ్యాఖ్యలను ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని రేవూరి పేర్కొన్నారు. "ముందే కోయిల కూసినట్లు" ఆమె మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. అదే సమయంలో మంత్రి కొండా సురేఖతో తనకు ప్రస్తుతం ఎలాంటి విభేదాలు లేవని రేవూరి స్పష్టం చేశారు. సీఎం పర్యటన సందర్భంగా మంత్రికి తానే ఫోన్ చేసి ఆహ్వానించానని, ఆమె వస్తానని చెప్పినా సభలకు హాజరు కాలేదని పేర్కొన్నారు.

### కూతురి సంచలన వ్యాఖ్యలు.. కొండా సురేఖకు కాంగ్రెస్ నోటీసులు

సురేఖకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నోటీసు

పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు సంబంధించి మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత చేసిన బహిరంగ వ్యాఖ్యలను పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలపై మంత్రి సురేఖ నుంచి వివరణ కోరింది. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రభుత్వ పెద్దలపై బహిరంగంగా వ్యాఖ్యలు చేయడంపై కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై మూడు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని సురేఖను ఆదేశించింది. మరోవైపు వనపర్తి జిల్లా కాంగ్రెస్‌లోనూ వివాదం తెరపైకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యేపై బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. తన వ్యాఖ్యలపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. డబ్బులు తీసుకొని ఎమ్మెల్యే సీట్లు కేటాయించారని ఇటీవల చిన్నారెడ్డి ఆరోపించారు. అందుకే తనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో సీటు రాలేదని పేర్కొన్నారు. ఫలితంగా వనపర్తి నియోజకవర్గాన్ని నాశనం చేశారని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని.. అవినీతికి పాల్పడేవారిని బయటకు గెంటేస్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నేతలపై పార్టీ లైన్ దాటి బహిరంగంగా విమర్శలు చేస్తే సహించబోమని క్రమశిక్షణ కమిటీ హెచ్చరించినట్లు సమాచారం.

# రైతుల వద్దకే బ్యాంకులు

## ప్రతి రైతుకూ రుణం అందాలి

**క్యూర్, ప్యూర్, రేర్ అనుగుణంగా బ్యాంకింగ్ వ్యూహాలు... రైతుల ఆదాయం పెరగాలి**

**ఎస్ఎల్బీసీ సమావేశంలో భట్టి విక్రమార్క**




**తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్, ఆర్థిక రంగం కీలక భాగస్వాములుగా మారాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేవలం ప్రభుత్వ వ్యయంతో ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని, భారీ స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని స్పష్టం చేశారు.**

**మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం విజన్ డాక్యుమెంట్ కాదు.. తెలంగాణ ప్రజలతో మనకున్న అభివృద్ధి ఒప్పందం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే బ్యాంకింగ్ రంగం కూడా రూపాంతరం చెందాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.**

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈవార్తలు): తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ బ్యాంకింగ్ వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను ఎంతవరకు సాధించాయన్నదే కాకుండా, ఇచ్చిన రుణాలతో ఎంత అభివృద్ధి జరిగింది, ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయనే అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పాదకత ఎంత పెరిగింది, గ్రామీణ ఆదాయం ఎంత మెరుగుపడింది, ఎంత ప్రైవేట్ పెట్టుబడి సమీకరించబడింది అన్నదే బ్యాంకింగ్ పనితీరుకు నిజమైన కొలమానంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ, వ్యవసాయ రంగం పునాది అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రైతులకు రుణాలు అవసరమయ్యే సమయంలోనే అందించాలని ఆయన చెప్పారు. అర్హత ఉన్న రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. రైతు రుణం కోసం బ్యాంకును వెతుక్కుంటూ రావడం కాదు.. బ్యాంకింగ్ వ్యవస్థే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం చెప్పారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ సహా ఇతర అనుబంధ రంగాలను అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని అన్నారు. రైతుకు రుణం ఇవ్వడం మాత్రమే కాకుండా, ఆ రుణాన్ని అధిక, స్థిరమైన వ్యవసాయ ఆదాయంగా మార్చడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు. రైతు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే కేవలం రికవరీ చర్యలకే పరిమితం కాకుండా, రైతు ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలని అన్నారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, కోత అనంతర వసతులు, వర్కింగ్ క్యాపిటల్ వంటి అంశాలను రుణ వ్యూహంలో భాగం చేయాలని భట్టి విక్రమార్క సూచించారు.

**జూన్ 2026 నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి 52,337 కోట్లు రుణాలుగా అందించడం అభినందనీయమే అయినప్పటికీ, రుణాలు సకాలంలో అందడం ముఖ్యమని ఆయన గుర్తుచేశారు.**

తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా రంగం కీలకమని అన్నారు. రుణం మంజూరు కావడం కంటే అవసరమైన సమయంలో డబ్బు చేతికి అందడం వ్యాపారులకు ముఖ్యమని చెప్పారు. దరఖాస్తు, మంజూరు, పంపిణీ ప్రక్రియకు స్పష్టమైన, కొలవదగిన కాలపరిమితి ఉండాలని ఆదేశించారు.

**క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ కింద ఈ త్రైమాసికంలో రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు.**

సీజీటీఎంఎస్ఈ కింద మంజూరు చేసే రుణాలకు పూచీకత్తు నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని ఆయన చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047లోని క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రాంతాల అవసరాలను బట్టి ప్రత్యేక రుణ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క అన్నారు. క్యూర్ లో ఏఐ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఏరోస్పేస్, స్టార్టప్‌లు, నాలెడ్జ్ రంగాలకు అధునాతన ఫైనాన్సింగ్ అవసరమని ఆయన తెలిపారు. ప్యూర్ ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక క్లస్టర్లు, గృహ నిర్మాణం, మౌలిక వసతులకు నిధులు అవసరమన్నారు. రేర్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ, ఫిషరీస్, గ్రామీణ పరిశ్రమలకు సకాలంలో, సరసమైన రుణాలు అందించాలని భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్రంలో జనధన్ ఖాతాలు భారీగా ఉన్నప్పటికీ దాదాపు 19.13 లక్షల ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ ఉందన్న విషయాన్ని గుర్తు ఆయన గుర్తు చేశారు. కేవలం ఖాతాలు తెరవడమే కాకుండా వారిని పొదుపు, బీమా, రుణాల దిశగా ప్రోత్సహించడమే నిజమైన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో నిష్క్రియాత్మకంగా ఉన్న బిజినెస్ కరస్పాండెంట్లను వెంటనే క్రియాశీలకం చేయాలని లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘాలను కేవలం బ్యాంక్ లింకేజీలకే పరిమితం చేయకుండా మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌గా తీర్చిదిద్దేలా 'ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్' అందించాలని కోరారు.

**ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్లు సమయానికి అందేలా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇస్తూ, తెలంగాణ ప్రజల సమగ్ర వికాసానికి బ్యాంకింగ్ రంగం ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.**

తెలంగాణ రైజింగ్ 2047 బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్'ను రూపొందించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. వ్యవసాయ, ఉత్పాదకత ఆధారిత రుణాలు, మీమీజులు--స్టార్టప్ ఫైనాన్స్, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పరిశ్రమలు, యువత ఉపాధి ఆధారిత రుణాలు, గ్రీన్--క్లైమేట్ ఫైనాన్స్, డిజిటల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్, జిల్లాల మధ్య క్రెడిట్ వ్యత్యాసాల నివారణ, దీర్ఘకాలిక మౌలిక వసతుల ఫైనాన్స్, కొత్త పరిశ్రమలు--సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలకు ఇందులో స్పష్టమైన వార్షిక లక్ష్యాలు ఉండాలని అన్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఇంటర్ బోర్డులో విజిలెన్స్ సోదాలు

**2019 నాటి ఫలితాల వివాదంపై విచారణ**

**గ్లోబరీనా సంస్థ అక్రమాలపై ప్రధాన ఆరోపణలు**

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈవార్తలు): తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం మరోసారి వార్తల్లో నిలిచింది. నాంపల్లిలోని బోర్డు కార్యాలయంలో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంటల పాటు ఈ సోదాలు నిర్వహించడంతో సిబ్బందిలో ఆందోళన నెలకొంది. 2019 నాటి ఇంటర్ ఫలితాల వివాదానికి సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. అప్పట్లో ఫలితాల వెల్లడి బాధ్యతలను నిర్వహించిన గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థ అక్రమాలకు పాల్పడిందన్న ఆరోపణలు పెను దుమారం రేపాయి. మార్కుల కేటాయింపులో జరిగిన పొరపాట్ల కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ విభాగం విచారణ ప్రారంభించింది. ఇందులో భాగంగానే అధికారులు ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సోదాలకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## రంగారెడ్డి.. అదుర్స్!

**వేగంగా ఎదుగుతున్న ప్రాంతాల్లో రంగారెడ్డికి చోటు**

**జైపూర్, నాసిక్, సూరత్‌తో పాటు రంగారెడ్డి ప్రస్తావన**

ముంబై: దేశంలో ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్న ప్రాంతాల్లో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చోటు దక్కింది. జైపూర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్‌తో పాటు రంగారెడ్డి తన ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నట్లు 'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్' తాజా నివేదిక వెల్లడించింది. దేశ ఆర్థిక వృద్ధి ఇక సంప్రదాయ మెట్రో నగరాలకే పరిమితం కాకుండా కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోందని తెలిపింది. 'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ సిటీ వైటాలిటీ ఇండెక్స్' ప్రకారం దేశంలో అత్యంత ఆర్థికంగా కీలకమైన మెట్రో నగరంగా పుణె నిలిచింది. ఐటీ సేవలు, అధునాతన తయారీ, ఆటోమొబైల్, విద్య, ఆవిష్కరణ ఆధారిత కార్యకలాపాలు పుణెకు కలిసొచ్చాయి. అహ్మదాబాద్ రెండో స్థానంలో నిలిచింది. మెట్రో నగరాల్లో ఆర్థిక వృద్ధి వేగం విషయంలో కోల్‌కతా ముందుంది. ఏప్రిల్-జూన్ 2026 కాలానికి రూపొందించిన సూచీలో దేశవ్యాప్తంగా 800కుపైగా జిల్లాలను పరిశీలించారు. ఉపగ్రహ ఆధారిత భౌగోళిక పరిశీలన డేటాతో పాటు ఆర్థిక సూచీలను ఇందుకు ఉపయోగించారు. అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో సౌత్ 24 పరగణాస్ అగ్రస్థానంలో నిలిచింది. నార్త్ 24 పరగణాస్, థానే తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జైపూర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్, రంగారెడ్డి ప్రాంతాలు కూడా తమ ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. గత దశాబ్దంలో దిమాపూర్, పంచమహల్స్, ఆనంద్, అయోధ్య, రాంపూర్, బస్తీ, షామ్లీ, బౌధ్, ఔరంగాబాద్, కోడెర్మా వంటి జిల్లాలు స్థిరమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేశాయి. దేశంలో పట్టణీకరణ మరింత విస్తృతంగా జరుగుతోందని నివేదిక పేర్కొంది. పెట్టుబడులు, వ్యాపారాలు, ప్రతిభావంతులైన మానవ వనరులు, మౌలిక వసతులు కొత్త నగరాల వైపు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపింది. భవిష్యత్ పెట్టుబడులకు ఈ కొత్త వృద్ధి మార్గాలు కీలకంగా మారనున్నాయని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ అభిప్రాయపడింది.

## రేగా కాంతారావుపై కేసు కొట్టివేత

హైదరాబాద్,ఆగస్టు 19 (ఈవార్తలు): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన లైంగిక వేధింపుల కేసును న్యాయస్థానం కొట్టివేసింది. పెళ్లి పేరుతో ఓ యువతిని లైంగికంగా వేధించారని ఆరోపిస్తూ హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కాంతారావుపై కేసు నమోదైంది. తన ప్రైవేట్ ఫొటోలతో కాంతారావు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అలాగే రియల్ ఎస్టేట్ వ్యవహారం పేరుతో తన వద్ద నుంచి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశారని కూడా ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది.

# కొత్త పార్టీ పెడుతున్నా

**విజయసాయి రెడ్డి కీలక ప్రకటన**



తిరుమల, ఆగస్టు 19 (ఈవార్తలు): మాజీ ఎంపీ వి. విజయసాయి రెడ్డి తన రాజకీయ పునః ప్రవేశంపై నెలకొన్న సందిగ్ధతకు తెరదించారు. వైసీపీలోకి తిరిగి వెళ్తారంటూ జోరుగా సాగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, సొంతంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కొత్త పార్టీకి శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయి రెడ్డి వివరించారు. ప్రజల పక్షాన బలమైన గొంతుకను వినిపించేందుకే కొత్త పార్టీ పెడుతున్నానని స్పష్టం చేశారు. పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలు, భవిష్యత్ కార్యాచరణను ఈ నెలలోనే విజయవాడలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడిస్తానని తెలిపారు. దేశం ఎల్‌నినో ప్రభావం లేకుండా సుభిక్షంగా ఉండాలని కూడా స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది తన రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయి రెడ్డి, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, కొన్ని నెలలకే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. రాజకీయాల్లోకి తిరిగి వస్తానని, సొంతంగా ఒక మీడియా సంస్థను కూడా ప్రారంభిస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పలు జాతీయ, రాష్ట్ర అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఆయన తిరిగి వైసీపీ గూటికి చేరతారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే ఆయన స్పందిస్తూ.. తనది స్వతంత్ర భావజాలమని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా నిర్ణయం తీసుకుంటానని ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే 'భారత్ జన వికాస్' పేరుతో ఆయన పార్టీ పెట్టబోతున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరిగింది. తాజాగా తిరుమలలో ఆయన చేసిన ప్రకటనతో ఈ ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే సొంత జెండాతో ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఖాయమైంది.

## తెలంగాణ నేతలు మారరని తెలుసు

**అందుకే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుందేమో**

**ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈవార్తలు): బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నాయకులకు ప్రాతినిధ్యం దక్కకపోవడంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగుతున్న వర్గ రాజకీయాలే దీనికి ప్రధాన కారణమని ఆరోపిస్తూ, రాష్ట్ర నేతలంతా తమ వైఖరిపై ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. గతంలో రాష్ట్రానికి చెందిన సీనియర్ నేతలకు జాతీయ స్థాయిలో కీలక పదవులు దక్కేవని, కానీ ఈసారి ఒక్కరికి కూడా జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించలేదని రాజా సింగ్ అన్నారు. తెలంగాణ బీజేపీలో నిరంతరం గ్రూప్ రాజకీయాలు నడుస్తున్నాయని, ప్రతి చిన్న విషయానికీ ఢిల్లీకి వెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి పెరిగిపోయిందని విమర్శించారు. నాయకుల మధ్య ఉన్న ఈ తీవ్ర విభేదాల వల్లే 'తెలంగాణ నేతలు మారరు' అనే ముగింపునకు అధిష్ఠానం వచ్చి ఉంటుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించారు. అలాగే, దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో ప్రత్యేక ప్రణాళికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర నేతలంతా పాత విభేదాలను, స్వయం ప్రయోజనాలను పక్కనబెట్టి, పశ్చిమ బెంగాల్ తరహాలో ఐక్యంగా పోరాడి తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐకమత్యంతో పోరాడితేనే భవిష్యత్తులో పార్టీ అధిష్ఠానం తగిన గుర్తింపునిచ్చి, పదవులు కేటాయిస్తుందని స్పష్టం చేశారు.

## వాట్సాప్ డీపీతో మోసం

**10 రోజుల్లోనే రూ.కోటి రికవరీ**

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈవార్తలు): సైబరాబాద్ పోలీసులు ఒక భారీ సైబర్ నేరానికి సంబంధించిన కేసును అత్యంత వేగంగా ఛేదించారు. కేవలం 10 రోజుల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, బాధితుడు కోల్పోయిన కోటి రూపాయల పూర్తి మొత్తాన్ని రికవరీ చేసి అతడికి అందజేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఒక ప్రముఖ చీరల దుకాణం యజమాని పేరు, వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్(డీపీ)ను వినియోగించి సైబర్ నేరగాళ్లు సదరు దుకాణంలో పనిచేసే అకౌంటెంట్‌కు నకిలీ సందేశం పంపారు. నిజంగా యజమానే డబ్బు అడుగుతున్నారని భావించిన అకౌంటెంట్, నేరగాళ్లు సూచించిన ఖాతాలకు ఏకంగా రూ. 1 కోటి బదిలీ చేశారు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రంగంలోకి దిగారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన దీపక్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. న్యాయస్థానం నుంచి త్వరితగతిన ఉత్తర్వులు పొంది, కేవలం 10 రోజుల్లోనే బాధితుడికి పూర్తి సొమ్ము వాపసు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేశ్ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. కేవలం వాట్సాప్ డీపీలు, పేర్లను చూసి ఎవరికీ పెద్ద మొత్తంలో నగదు పంపవద్దని హెచ్చరించారు. ఎవరైనా డబ్బు అడిగితే, వారికి నేరుగా ఫోన్ చేసి వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు. వాట్సాప్ లేదా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే తెలియని ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇన్‌స్టాల్ చేయవద్దని కోరారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, వెంటనే టోల్-ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

## త్వరలో కొత్త చాట్‌జీపీటీ

**స్క్రీన్ నుంచి మీటింగ్స్‌పై నజర్**




న్యూయార్క్: కంప్యూటర్‌లో ఏం చేస్తున్నారు? ఎవరితో మీటింగ్‌లో ఉన్నారు? ఏం టైప్ చేస్తున్నారు? ఏ మెయిల్ రాస్తున్నారు? ఇవన్నీ అర్థం చేసుకుని అవసరమైన సమయంలో సాయం చేసే ఏఐ అసిస్టెంట్ వస్తే ఎలా ఉంటుంది? భవిష్యత్తులో చాట్‌జీపీటీ ఇలాంటి సామర్థ్యాలతో రావచ్చని ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. జెడ్ ఫెలోస్ వ్యవస్థాపకుడు కోరీ లెవీతో జరిగిన ఇంటర్వ్యూలో ఆల్ట్‌మన్ ఈ విషయాలను వెల్లడించారు. భవిష్యత్ చాట్‌జీపీటీ వినియోగదారుడి కంప్యూటర్ స్క్రీన్, మీటింగ్స్, కాల్స్‌ను నిరంతరం గమనిస్తూ సందర్భాన్ని అర్థం చేసుకునే స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. ఇది ఆరు నెలల్లో అందుబాటులోకి రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. వినియోగదారులు ఏ సమాచారాన్ని ఏఐతో పంచుకోవాలో వారే నిర్ణయించుకోవచ్చని ఆల్ట్‌మన్ తెలిపారు. టెక్స్ట్ మెసేజ్‌లు, ఈమెయిల్స్, డాక్యుమెంట్లు, స్లాక్ వంటి వనరులకు యాక్సెస్ ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఏఐ స్వయంగా నిర్ణయాలు తీసుకోదని.. వినియోగదారుడితో కలిసి పనిచేస్తూ సూచనలు ఇవ్వడం, అనుమతి ఉన్న పనులను పూర్తి చేయడం చేస్తుందని వివరించారు.

## గెట్ రెడీ.. ఎన్నికలకు సిద్ధంకండి: జగన్



తాడేపల్లి, ఆగస్టు 19 (ఈవార్తలు): ఏపీలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.



## గంగమ్మ ఆలయ నిర్మాణానికి సహకరిస్తా: జీవన్ రెడ్డి

జగిత్యాల, ఆగస్టు 19 (ఈవార్తలు): అల్లీపూర్ గ్రామ గంగపుత్రుల సంఘం సభ్యులు మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి గంగమ్మ ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గంగమ్మ ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. గంగమ్మ తల్లి గంగపుత్రులకు ఆరాధ్య దైవమని అన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. జగిత్యాల జిల్లాలో 700 చెరువులకు కేవలం 200 చెరువుల్లోనే చేప విత్తనం పంపిణీ చేసినట్లు తెలిపారు. సకాలంలో చేప విత్తనం అందకపోవడంతో మత్స్యకారులు నష్టపోతున్నారని అన్నారు. సొసైటీలకు నేరుగా నగదు అందిస్తే సకాలంలో చేప విత్తనం కొనుగోలు చేసి చెరువుల్లో వదిలే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. టెండర్‌దారుల ద్వారా చేప విత్తనాల పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అల్లిపూర్ గంగపుత్రుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఏకగ్రీవం

జగిత్యాల, ఆగస్టు 19 (ఈవార్తలు): జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల ప్రక్రియ బుధవారం ఏకగ్రీవంగా పూర్తయింది. రెండోసారి చాంబర్ అధ్యక్షుడిగా కమటాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ నెల 15న వెలువడిన నోటిఫికేషన్ మేరకు బుధవారం నామినేషన్ల పరిశీలన చేపట్టగా ఐదు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది. దీంతో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అధ్యక్షుడిగా కమటాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది శ్రీనివాస్, కోశాధికారిగా కప్పల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఎలిమిల్ల చంద్రకాంత్, సహాయ కార్యదర్శిగా సామ సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల కన్వీనర్ పల్లెల రాజయ్య, ఎన్నికల అధికారి పబ్బ శ్రీనివాస్, ఉప ఎన్నికల అధికారులు శ్రీనివాసమూర్తి, పాత సుధాకర్ నూతన కార్యవర్గాన్ని అభినందించి సన్మానించారు. ఏకగ్రీవ ఎన్నిక జగిత్యాల పట్టణంలోని ఇతర సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ఇది సభ్యుల ఐకమత్యానికి, సంఘ బలోపేతానికి నిదర్శనమని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. సభ్యుల శ్రేయస్సు కోసం పనిచేస్తామని, అనుబంధ సంఘాల సూచనల మేరకు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి త్వరలో నూతన కార్యవర్గ పరిచయ వేదిక నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## ఘనంగా కనకదుర్గ గుడి 30వ వార్షికోత్సవ వేడుకలు



కూకట్‌పల్లి, ఆగస్టు 19 (ఈవార్తలు): బాలానగర్‌లోని ఫతేనగర్ జవహర్ కాలనీలో కొలువైన శ్రీ కనకదుర్గ దేవి, శీతలాదేవి, కాళికాదేవి ఆలయంలో 30వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో రోజంతా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం దుర్గా హోమం, మూలమంత్ర హవనం, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిగీతాలు, నామస్మరణల మధ్య అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక పసుపు-బొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రధాన అర్చకులు దోర్బల కాశీనాథ్ శర్మ పర్యవేక్షణలో వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, సభ్యులు, స్థానిక భక్తులు అందించిన సహాయ సహకారాలతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. 30వ వార్షికోత్సవ వేడుకలతో జవహర్ కాలనీతో పాటు ఫతేనగర్ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## టీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, నగర స్థాయిల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. కేంద్రాల ద్వారా కొత్త పాన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడం, పాన్ కార్డు వివరాల్లో సవరణలు, బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్, బ్యాంకు నగదు బదిలీలు, ఆధార్ ఆధారిత చెల్లింపు సేవలు, మైక్రో ఏటీఎం సేవలు, నగదు డిపాజిట్లు, ఆరోగ్య, బైక్, కార్ బీమా సేవలు, వివిధ బిల్లుల చెల్లింపులు వంటి ఆన్‌లైన్ సేవలను ప్రజలకు అందించవచ్చని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఆమోదించిన 100కు పైగా నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు నమోదు, 100కు పైగా ఆమోదిత నైపుణ్య పరీక్షల ధ్రువపత్రాల కోసం నమోదు, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సంబంధించిన మాక్ టెస్టులకు నమోదు వంటి సేవలను కూడా అందించవచ్చన్నారు. ప్రజలకు వివిధ ఆన్‌లైన్ సేవలను అందించడం ద్వారా కేంద్రాల నిర్వాహకులు స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని వెంకట్‌రెడ్డి తెలిపారు.




## సీఈఐఆర్‌తో పోయిన ఫోన్లను పొందొచ్చు

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: జగిత్యాల ఎస్పీ

జగిత్యాల, ఆగస్టు 19 (ఈవార్తలు): సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీఈఐఆర్ సేవను సద్వినియోగం చేసుకుంటే ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఉందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసిన 102 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించారు. పోయిన లేదా చోరీకి గురైన ఫోన్ల వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తే వాటిని గుర్తించి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా రూ.4.5 కోట్ల విలువైన 2,024 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు వెల్లడించారు. పోయిన ఫోన్‌ను నిర్లక్ష్యం చేస్తే అందులోని వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందన్నారు. సెకండ్‌హ్యాండ్ ఫోన్ కొనుగోలు చేసే ముందు ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్‌లో తనిఖీ చేసుకోవాలని సూచించారు. దొరికిన ఫోన్లను సమీప పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని కోరారు. ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన సీఈఐఆర్ బృందాన్ని ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు. సైబర్ మోసగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. అజ్ఞాత నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్ఐ కృష్ణ, సీఈఐఆర్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

జగిత్యాల, ఆగస్టు 19 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గం గ్రామంలో హనుమాన్ దేవాలయంలో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్, ఆయన సతీమణి రాధిక కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, రాజేశం గౌడ్ కూడా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. హనుమాన్ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులను అభినందించారు. హనుమంతుడు భక్తి, ధైర్యం, సేవాభావం, నిస్వార్థ త్యాగానికి ప్రతీక అని అన్నారు. శ్రీరాముడిపై ఆయన చూపిన అచంచల భక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. నేటి యువత హనుమంతుడి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. ఆలయాలు కేవలం పూజలు నిర్వహించే ప్రదేశాలు మాత్రమే కాకుండా సమాజంలో ఐకమత్యం, సాంస్కృతిక విలువలను పెంపొందించే కేంద్రాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆంజనేయస్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, రాజేశం గౌడ్, గ్రామ, మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి: ఏబీవీపీ




కోరుట్ల, ఆగస్టు 19 (ఈవార్తలు): కోరుట్ల పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రతికూలంగా ఉన్న జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏబీవీపీ కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి కొత్త బస్టాండ్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ విద్యావ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జగిత్యాల జిల్లా కన్వీనర్ మడవేణి సునీల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97 విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని ఆరోపించారు. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శక్తి కళాశాలను పాలిటెక్నిక్ కళాశాలతో కలిపే ప్రతిపాదనను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం పాలిటెక్నిక్ కళాశాల స్వయంప్రతిపత్తిని, విద్యార్థులకు అందుతున్న వసతులను దెబ్బతీసే చర్యలను సహించబోమని హెచ్చరించారు. విద్యార్థుల హక్కులను కాలరాసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహదేవ్, మనీష్, రశ్విత్, శ్రీతిన్, మణితేజతో పాటు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండగట్టులో రెండ్రోజులు అంతరాలయ దర్శనాలు రద్దు

మల్యాల, ఆగస్టు 19 (ఈవార్తలు): శ్రీ ఆంజనేయస్వామి దేవస్థాన గర్భాలయ మరమ్మతు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రెండు రోజుల పాటు అంతరాలయ దర్శనాలను రద్దు చేసినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఆగస్టు 20, 21 తేదీల్లో భక్తులకు అంతరాలయ దర్శనాలను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మరమ్మతు పనులు పూర్తయిన అనంతరం ఆగస్టు 22, శనివారం నుంచి అంతరాలయ దర్శనాలను యథావిధిగా పునఃప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి దేవస్థానానికి సహకరించాలని కార్యనిర్వహణాధికారి కోరారు.



## 30 క్వింటాళ్ల అక్రమ పీడీఎస్ బియ్యం సీజ్

వేములవాడ రూరల్, ఆగస్టు 19 (ఈవార్తలు): వేములవాడ రూరల్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని రెండు ఆటోలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వట్టెంల గ్రామంలోని ఓ గుడిసెలో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో రెండు ఆటోల్లో తరలిస్తున్న మరో 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించేందుకు నల్లగొండ వైపు తరలిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో వానరసి శ్రీనివాస్, మోతె భానుప్రసాద్, గుంట ఎల్లయ్యలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పీడీఎస్ బియ్యాన్ని పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్న ఎస్ఐ వెంకట్రాజం, కానిస్టేబుల్ దేవరాజు, సిబ్బందిని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అభినందించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే ప్రభుత్వ పతనం: ఏఐఎస్ఎఫ్



జగిత్యాల, ఆగస్టు 19 (ఈవార్తలు): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం కోరుట్లలోని ప్రభాకర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు సమీర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మణికంఠరెడ్డి మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్య పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం సొంత డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల సాంకేతిక విద్యా వ్యవస్థ నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని విమర్శించారు. పాలిటెక్నిక్ కళాశాలలను అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో విద్యారంగానికి నష్టం కలిగిస్తోందన్నారు. శక్తి పాలసీని వెనక్కి తీసుకోవడంతో పాటు జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంతో పాటు పాలిటెక్నిక్ కళాశాలల విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే విద్యార్థుల ఆగ్రహానికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సమీర్, కార్యదర్శి అక్రమ్ మాలిక్, ఉపాధ్యక్షుడు మంద రాకేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గని మనోజ్, ముజీబ్, రాజీవ్, విష్ణుతేజ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి, ఆగస్టు 19 (ఈవార్తలు): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త, ఎస్వీ కన్స్ట్రక్షన్స్ సంస్థ నిర్వాహకుడు, అయ్యప్ప స్వామి భక్తుడు, గురుస్వామి ఇనగంటి ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలు బుధవారం ఫతేనగర్ పైప్‌లైన్ రోడ్డులోని శ్రీ సాయి జ్యోతి మెడికల్ దుకాణం వద్ద ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి భక్తులు, సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాద్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు గురుస్వామి ఇనగంటి ప్రసాద్‌రావును ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇనగంటి ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ఫతేనగర్ శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో తన జన్మదిన వేడుకలను అందరూ కలిసి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటిస్తూ మానవత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి తమకు చేతనైనంత సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. తమకు ఉన్నదాంట్లో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి అందించడం ద్వారా నిజమైన మానవత్వాన్ని చాటుకోవచ్చన్నారు. అందరూ కలిసికట్టుగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు కొట్టం శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వాసుగుప్తా, వడకట్టు శ్రీనివాస్, చిట్టిబాబు, సూర్యకిరణ్, ఆర్.కె. రాజు పటేల్, మధు, చిన్న, మధుగుప్తా, పురుషోత్తం, జంషీర్, రత్నం, కోటి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




## మహేష్ రియల్ ఎస్టేట్ కార్యాలయం ప్రారంభం

కూకట్‌పల్లి, ఆగస్టు 19 (ఈవార్తలు): ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మహేష్ రియల్ ఎస్టేట్ అండ్ కార్ రెంటల్' కార్యాలయాన్ని ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఉత్తమమైన రియల్ ఎస్టేట్ సేవలు అందిస్తూ వ్యాపారంలో అభివృద్ధి సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యాలయ నిర్వాహకుడు మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్వారీ శశిధర్, గుడ్ల శ్రీనివాస్, సంగమేశ్, అగ్రవాసు, ఖలీమ్, తరుణ్, ధనుంజయ్, గోపాల్, వాసు, మల్లేష్, శేఖర్, నాగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో బతుకమ్మ తెప్పకు భూమిపూజ

వేములవాడ అర్బన్, ఆగస్టు 19 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని 13వ వార్డులో కట్ట కాలువ సమీపంలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి వార్డు కౌన్సిలర్ మూడపల్లి నీలమ్మ, నాగరాజు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మూడపల్లి నీలమ్మ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పండుగగా బతుకమ్మను మహిళలు అత్యంత ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, ఆటపాటలతో వేడుకలు నిర్వహించి అనంతరం నీటిలో నిమజ్జనం చేస్తారని వివరించారు. బతుకమ్మ తెప్ప నిర్మాణానికి భూమిపూజ చేయడం, వార్డు మహిళలకు తెప్ప అందుబాటులోకి రానుండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు సంఘ స్వామి, టైలర్ శ్రీను, తోట రాజు, కొక్కల రాజు, అన్నారం శ్రీను, కాశ శ్రీను, కొండా శేఖర్, సిరిగిరి శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యుడు ఫిర్ మహమ్మద్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఏఈ అనన్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సాయిని అంజయ్య, వేదిరే రాజేశం, శంకర్, నరసింహారెడ్డి, శ్రీనగర్ కాలనీ నాయకులు పెరుక శ్రీను, పెరుక రవి, కోరేపు నర్సయ్య తదితరులతో పాటు వార్డు మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. బతుకమ్మ తెప్ప అందుబాటులోకి రానుండటంపై వార్డు మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

# పల్లె పల్లెకు పొన్నం అన్న





## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం

వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, బోదకాలు, తలసేమియా తదితర వర్గాల్లో అర్హులైన వారికి పింఛన్లు అందేలా గ్రామస్థాయిలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరాలనే లక్ష్యంతో గ్రామాల్లోనే లబ్ధిదారులను గుర్తించడం ఈ కార్యక్రమంలో మరో ముఖ్యమైన అంశంగా మారింది. కొన్ని సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కరించగలిగేవి కాగా.. మరికొన్ని రాష్ట్రస్థాయిలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. గౌరవెల్లి ప్రాజెక్టు, సాగునీటి కాలువలకు భూసేకరణ, ఎల్ఎండీ నుంచి వచ్చే నీటి ప్రాజెక్టు, ఎంఎంఆర్ కింద పెండింగ్‌లో ఉన్న పనులు వంటి దీర్ఘకాలిక అంశాలను ముఖ్యమంత్రి, కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

## పల్లె బాటన ప్రజల మనిషి.. సమస్య ఉన్నచోటే పరిష్కారం

### హుస్నాబాద్‌లో 173 గ్రామాల బాట పట్టిన మంత్రి

**ప్రజలతో మమేకమవుతూ.. వారి సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ.. పరిష్కారానికి అక్కడికక్కడే మార్గం చూపుతూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన "పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెల్లో ప్రజా పాలన" కార్యక్రమం హుస్నాబాద్ నియోజకవర్గంలో ఆదర్శంగా నిలుస్తోంది. పాలనను కార్యాలయాల నుంచి పల్లె గడపల వద్దకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో 173 గ్రామాల్లో ప్రజలతో నేరుగా మమేకమయ్యే ఈ కార్యక్రమానికి బుధవారం సైదాపూర్ మండలంలో మంత్రి శ్రీకారం చుట్టారు.**

(ఈవార్తలు – ప్రత్యేకం)

సాధారణంగా ప్రజలు తమ సమస్యలు చెప్పేందుకు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అందుకు భిన్నమైన దృశ్యం కనిపించింది. ప్రజలే అధికారుల వద్దకు వెళ్లడం కాదు.. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకే రావడం ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గ్రామాల్లో ప్రజల మధ్య కూర్చున్న మంత్రి.. వారి సమస్యలను ఓపికగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు సూచించారు. సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి నుంచి ప్రారంభమైన మంత్రి పర్యటన ఎక్లాస్‌పూర్, సోమారం, వెన్నంపల్లి, ఆరెపల్లి గ్రామాల వరకు కొనసాగింది. ప్రతి గ్రామంలో ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, విద్య, వైద్యం, సాగునీరు, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రజల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో ఏ పని పెండింగ్‌లో ఉంది? అర్హత ఉన్నా ఏ కుటుంబానికి పథకం అందలేదు? రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులేమిటి? వంటి అంశాలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. సమస్యను విని వదిలేయకుండా.. సంబంధిత శాఖను గుర్తించి, అధికారులతో సమన్వయం చేసి, పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.

#### ప్రజల మధ్యే ప్రజాపాలన

"ప్రజాపాలన అంటే కార్యాలయంలో కూర్చొని పాలన చేయడం కాదు.. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే" అనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో ప్రధాన సమస్యలను గుర్తించి వాటికి సంబంధించిన శాఖ, అధికారి, అవసరమైన చర్యలు, పరిష్కార గడువును నిర్ణయించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. సమస్య పరిష్కారమైన తర్వాత కూడా దాని పురోగతిని సమీక్షించే విధానం తీసుకురావడం ద్వారా ప్రజా సమస్యలపై నిరంతర పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

#### దుద్దెనపల్లిలో అభివృద్ధికి అడుగులు

దుద్దెనపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను మంత్రి ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, రేషన్ కార్డులు, భూ భారతి, కళ్యాణ లక్ష్మి, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం వంటి పలు సంక్షేమ కార్యక్రమాల అమలును వివరించారు. దుద్దెనపల్లి--మొగిలిపల్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.56 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ భవనం, జిమ్, గ్రామ సమైక్య భవనం వంటి మౌలిక వసతులపై కూడా వివరించారు.

#### ఎక్లాస్‌పూర్‌లోనూ ప్రజలతో ముఖాముఖి

ఎక్లాస్‌పూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించిన మంత్రి.. అనంతరం గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, రేషన్ కార్డులు, పింఛన్లు, మహిళా సంఘాలకు అందుతున్న ఆర్థిక సహాయం తదితర అంశాలను వివరించారు. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్న వారిని గుర్తించి వారికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి రైతులకు సూచించారు. జలసిరి కార్యక్రమం ద్వారా ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ ఇంజెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వరి సాగుపైనే ఆధారపడకుండా ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. 200 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు పూర్తి చేసిన గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షల అభివృద్ధి నిధులు అందిస్తామని ప్రకటించారు.



#### 173 గ్రామాలు.. ప్రజలే కేంద్రబిందువు

హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో కొనసాగనున్న ఈ పల్లెబాటలో ప్రతి గ్రామ సమస్యను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా మంత్రి ముందుకు సాగుతున్నారు. ప్రజల వద్దకు నాయకుడు వెళ్లడం.. ప్రజల సమస్యలను స్వయంగా వినడం.. అధికార యంత్రాంగాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం.. పరిష్కారానికి గడువు పెట్టడం.. ఆ తర్వాత పురోగతిని పర్యవేక్షించడం – ఈ విధానం "పల్లె పల్లెకు పొన్నం అన్న" కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తోంది. హుస్నాబాద్‌లో ప్రారంభమైన ఈ పల్లె ప్రయాణం ఒక నియోజకవర్గ పర్యటనకే పరిమితం కాకుండా.. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లే వినూత్న కార్యక్రమంగా రూపుదిద్దుకుంటోంది. మంత్రి పల్లె బాట.. సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిచింది.



## విద్యార్థులే దేశ భవిష్యత్తు

**ఎస్ఆర్ డిజీ స్కూల్ సందర్శనలో బండి సంజయ్**

కరీంనగర్, ఆగస్టు 19 (ఈవార్తలు): నగరంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అశోక్‌నగర్‌లోని ఎస్సార్ డీజీ స్కూల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్ ఉమా రమణ తదితరులు పాల్గొన్నారు. పాఠశాలకు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఎస్సార్ విద్యాసంస్థల డీజీఎం సచిన్, ప్రిన్సిపాల్ మానస ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగించారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఎస్సార్ డీజీ స్కూల్ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డీజీఎం సచిన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల పరిజ్ఞానమే కాకుండా, వారిలోని సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను వెలికితీసేలా నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర మంత్రి పాఠశాలను సందర్శించడం విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపిందన్నారు. ప్రిన్సిపాల్ మానస మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ పాఠశాలను సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించడం ఎంతో ఆనందంగా ఉందని, ఇందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 19 (ఈవార్తలు): తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాసాని జ్ఞానేశ్వర్ 72వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో అభిమానుల సమక్షంలో కాసాని జ్ఞానేశ్వర్ కేక్ కట్ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ, ఉచిత వైద్య శిబిరం, స్వచ్ఛంద రక్తదాన శిబిరం, పేద విద్యార్థులకు బ్యాగుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు డి. సదానంద, చెన్నయ్య, శారద, నీలం శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకటేష్, కాసాని వీరేష్, కాసాని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్, అయోధ్య విరాళాలపై కాంగ్రెస్ ఆందోళనలు

**లోక్‌సభ సీట్ల పెంపును వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేసిన కాంగ్రెస్**

**543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్**

**800 పట్టణాలకు విస్తరించనున్న రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్'**



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం, రామ మందిర విరాళాల్లో చోటుచేసుకున్నాయన్న అవకతవకల ఆరోపణలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ కార్యవర్గ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానించింది. పార్లమెంటులో నీట్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం విపక్షాల ఐక్యతకు నిదర్శనమని, దీనిని తమ విజయంగా భావిస్తున్నట్లు పార్టీ పేర్కొంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను కాంగ్రెస్ మరోసారి తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలనే యథాతథంగా కొనసాగించాలని, మహిళా రిజర్వేషన్లను కూడా ఈ స్థానాల్లోనే అమలు చేయాలని స్పష్టం చేసింది. నియోజకవర్గాల సంఖ్యను పెంచే ప్రతిపాదనకు తాము అంగీకరించబోమని ఈ సందర్భంగా తేల్చిచెప్పింది. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థులు, యువత లక్ష్యంగా రాహుల్ గాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాలకు విస్తరించాలని నిర్ణయించారు. వీటిలో పలు కీలక సమావేశాల్లో రాహుల్ గాంధీ స్వయంగా పాల్గొననున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా చొరబాట్ల అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని సీడబ్ల్యూసీ డిమాండ్ చేసింది. అలాగే కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం పలు రంగాల్లో విఫలమైందని విమర్శించింది. సీడబ్ల్యూసీ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను పార్టీ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ మీడియాకు వివరించారు.

## బ్రాహ్మణులకు మాయావతి గాలం

**2027 ఎన్నికలే లక్ష్యంగా అడుగులు**



లక్నో: ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళిత-బ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు. ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్రం ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు. దీనికి తోడు, 2027 ఎన్నికల బరిలో నిలిపే బ్రాహ్మణులతో పాటు ఇతర అగ్రవర్ణాల అభ్యర్థులను బీఎస్పీ ఇప్పటి నుంచే ఖరారు చేయడం ప్రారంభించింది. తమ తాజా వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలలో కలవరం మొదలైందని మాయావతి వ్యాఖ్యానించారు. 2007 నాటి "సర్వజన్" (అన్ని వర్గాల హితం) నినాదాన్ని పునరావృతం చేస్తూ, ఈసారి కూడా అగ్రవర్ణాలకు ప్రాధాన్యతనిస్తూ మరిన్ని సీట్లు కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## ఇండిగో వెబ్‌సైట్ డౌన్




న్యూఢిల్లీ: దేశీయ విమానయాన మార్కెట్లో అతిపెద్ద సంస్థ ఇండిగో వెబ్‌సైట్‌లో బుధవారం సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో పలువురు ప్రయాణికులు విమాన టికెట్లు బుక్ చేసుకోలేకపోయారు. ఢిల్లీ నుంచి పలు నగరాలకు వెళ్లేందుకు ఇండిగో వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు ఈ సమస్య ఎదురైంది. వేర్వేరు తేదీల్లో విమానాల కోసం వెతికినా అందుబాటులో ఉన్న సర్వీసుల వివరాలు కనిపించలేదని ప్రయాణికులు తెలిపారు. మరో ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లోనూ ఇండిగో టికెట్ బుక్ చేసుకునే సమయంలో సాంకేతిక సమస్య ఉన్నట్లు సందేశం వచ్చింది. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ప్రయత్నించాలని సూచించింది. వెబ్‌సైట్ సమస్యపై పలువురు ప్రయాణికులు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఫిర్యాదు చేశారు. టికెట్లు బుక్ చేసుకోవడంతో పాటు ఆన్‌లైన్ చెక్-ఇన్ పూర్తి చేయడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. విమానాల వివరాలు కనిపించకపోవడంతో తదుపరి ప్రక్రియకు వెళ్లలేకపోయామని తెలిపారు. అయితే ఈ సాంకేతిక సమస్యకు కారణమేంటన్న దానిపై ఇండిగో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సమస్య ఎంతమందిని ప్రభావితం చేసిందన్న వివరాలు కూడా వెల్లడించలేదు.

## భీమన్న గుడిలో నూతన విరాళాల కౌంటర్లు ప్రారంభం

వేములవాడ అర్బన్, ఆగస్టు 19 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో నూతన విరాళాల కౌంటర్లను ప్రారంభించారు. డొనేషన్ కౌంటర్, ప్రోటోకాల్ కార్యాలయం పక్కన ప్రచార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాశ్వత పూజల విరాళాల కౌంటర్లను ఆలయ ఈవో ఎల్. రమాదేవి, డీఈవో నవీన్‌కుమార్, ఈఈ రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన కౌంటర్లకు శుభారంభం చేశారు. కౌంటర్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయ ఈవో ఎల్. రమాదేవి రూ.1,116, ఈఈ రాజేష్ రూ.1,116 విరాళంగా అందజేసి తొలి విరాళాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ వివరాలను దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి (పీఆర్వో) పెరిక శ్రీనివాస్ వెల్లడించారు.

## రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష విరాళం



వేములవాడ అర్బన్, ఆగస్టు 19 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనుల కోసం హైదరాబాద్ మల్కాజిగిరికి చెందిన ఖమ్మంపాటి శ్యామల--శ్రీకాంత్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ చెక్కును దేవస్థానం ప్రోటోకాల్ కార్యాలయంలో ప్రజా సంబంధాల అధికారి (పీఆర్వో) పెరిక శ్రీనివాస్‌కు అందజేశారు. అనంతరం దంపతులు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో దేవస్థానం అకౌంట్స్ విభాగం అడ్వైజర్ ఆగమరావు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం




వేములవాడ అర్బన్, ఆగస్టు 19 (ఈవార్తలు): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, వేములవాడ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఫౌండేషన్ మరియు న్యూమరసీ కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణంలోని కోనాయిపల్లి, తిప్పాపురం, వేములవాడ ప్రాథమిక పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల అభ్యసన స్థాయి, ప్రతిభా సామర్థ్యాలను మూల్యాంకనం చేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బన్నాజీతో కలిసి నిర్వహించిన ఈ మూల్యాంకనంలో విద్యార్థులు ధారాళంగా చదవడం, రాయడం, గణితంలోని ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవడం వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బన్నాజీతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

లవ్లీ చిత్రం



నిక్కీ తంబోలి

# సినిమా టికెట్ ధర పెంచితే..! 20% టీజీఎఫ్‌డీసీకి ఇవ్వాల్సిందే




## రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

ఈవార్తలు–వినోదవాణి:సినిమా టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. టికెట్ ధరలను పెంచడం ద్వారా వచ్చే అదనపు ఆదాయంలో 20 శాతాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి సంక్షేమ విరాళంగా చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మొత్తాన్ని తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఉద్యోగుల సంక్షేమం కోసం వినియోగించనున్నట్లు స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. టికెట్ ధరల పెంపుతో వచ్చే అదనపు రాబడిపై వర్తించే 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల నుంచి సంబంధిత చిత్రాల నిర్మాతలే వసూలు చేయాలి. అనంతరం వసూలు చేసిన మొత్తాన్ని తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఉద్యోగుల సమాఖ్య సంక్షేమ సంఘం ఖాతాకు జమ చేయాలి. ఈ ఖాతాను తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన ఈ ఆదేశాలు 'అఖండ–2', 'ది రాజాసాబ్', 'మన శంకర వర ప్రసాద్ గారు పండుగకు వస్తున్నారు', 'పెద్ది' చిత్రాలకు కూడా వర్తిస్తాయి. ఈ నాలుగు చిత్రాల నిర్మాతలకు ఎగ్జిబిటర్ల నుంచి 20 శాతం సంక్షేమ విరాళాన్ని వసూలు చేసి, ప్రభుత్వం సూచించిన ఖాతాలో జమ చేసే అధికారాన్ని కల్పించారు. ఈ మేరకు 14 రీల్స్ ప్లస్ ఎల్ఎల్‌పీ, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, షైన్ స్క్రీన్స్ ఇండియా, వృద్ధి సినిమాస్ సంస్థలకు ప్రభుత్వం లేఖలు పంపింది. సంబంధిత నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేసి, టీజీఎఫ్‌డీసీ ద్వారా నిర్వహించే తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఖాతాలో జమ చేయాలని హోం శాఖ ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత నిర్మాతలకు సూచించింది.

# ప్రైమ్‌లోకి 'శ్రీనివాస మంగపురం'

ఈవార్తలు–వినోదవాణి:తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా రేపటి నుంచి (ఆగస్టు 20 నుంచి) స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.





# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ టైటిల్ 'జనవరి 12 విడుదల'

ఈవార్తలు–వినోదవాణి:విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సినిమాకు టైటిల్ ఖరారైంది. 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. షైన్ స్క్రీన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను ప్రత్యేక వీడియో ద్వారా ప్రకటించారు. ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు నివాళిగా 'అప్పుల అప్పారావు'లోని ఓ హాస్య సన్నివేశాన్ని గుర్తు చేస్తూ వీడియోను మొదలుపెట్టారు. ఈవీవీ తనకు స్ఫూర్తి అని అనిల్ రావిపూడి పలు సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే. వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతిశెట్టి కలిసి అనిల్ రావిపూడిని సినిమా టైటిల్ ఏంటని అడుగుతారు. అందుకు ఆయన ఎలాంటి తడబాటు లేకుండా 'జనవరి 12 విడుదల' అని చెబుతారు. దీంతో నటీనటులు కాసేపు అయోమయానికి గురవుతారు. తాము విడుదల తేదీ గురించి కాదు.. టైటిల్ గురించి అడిగామని చెబుతారు. చివరికి అదే సినిమా టైటిల్ అని అనిల్ వెల్లడించడంతో వీడియో ముగుస్తుంది.

# ఉక్కిరిబిక్కిరి అవుతున్నా: శ్రీలీల

ఈవార్తలు–వినోదవాణి:దక్షిణాది ప్రేక్షకుల్ని అలరిస్తున్న హీరోయిన్లలో శ్రీలీల ఒకరు. మాతృభాష అయిన కన్నడ చిత్రాలతో కెరీర్ ప్రారంభించి తర్వాత తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. 'పెళ్లి సందడి'తో మొదలుపెట్టి వరసగా సినిమాలు చేసింది. అందం, డ్యాన్స్‌లతో కుర్రకారు మతి పోగొట్టింది. 'పుష్ప 2'లో ఐటమ్ సాంగ్ చేసి పాన్ ఇండియా వైడ్ గుర్తింపు తెచ్చుకుంది. ఈ ఏడాది తమిళంలో పరాశక్తి, తెలుగులో ఉస్తాద్ భగత్ సింగ్ మూవీస్ చేసింది. ప్రస్తుతం ధనుష్‌కు జంటగా 'ఓం' సినిమాలో శ్రీలీల ఓ హీరోయిన్. త్వరలో ఈమె నటించిన హిందీ మూవీ కూడా రిలీజ్ కానుంది. అయితే తాను ఇలా మంచి గుర్తింపు తెచ్చుకోవడానికి అభిమానులే కారణమని చెబుతోంది. ఈ మధ్యే ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అభిమానులని ప్రత్యక్షంగా కలిసినప్పుడు వారు చూపించే ఆదరాభిమానాలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. నేను డబ్బు సంపాదిస్తున్నప్పుడు, పేరు తెచ్చుకున్నప్పుడు కూడా ఇంత సంతోషపడలేదు. అభిమానులు వల్ల మాత్రమే అంతా సాధ్యం అవుతోంది. ఇంత ప్రేమ పొందడానికి ప్రాప్తి ఉండాలి. అందుకు నటిగా నేను గర్వపడుతున్నాను అని శ్రీలీల పేర్కొంది.






# చరణ్ అన్నతో సినిమా చేయాలని

ఈవార్తలు–వినోదవాణి:మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన సోదరుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి వెండితెరను పంచుకోవాలన్న తన ఆకాంక్షను వెల్లడించారు. ఇటీవల 'కొరియన్ కనకరాజు' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆయన, ఆ సంతోషాన్ని పంచుకుంటూ తన కెరీర్, భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గత ఐదేళ్లుగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో కొంత ఒత్తిడికి లోనయ్యానని, అయితే 'కొరియన్ కనకరాజు' చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన ఆదరణతో ఇప్పుడు ఎంతో ఊరటగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. కేవలం ఒకే తరహా జోనర్‌లకు పరిమితం కావడం తనకు ఇష్టం ఉండదని, నటుడన్నవాడు ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయాలని తాను నమ్ముతానని చెప్పారు. కరోనా అనంతర కాలంలో ఓటీటీ ప్రాధాన్యత పెరిగినప్పటికీ, థియేటర్‌లకు వచ్చే ప్రేక్షకులకు ఒత్తిడిని దూరం చేసేలా స్వచ్ఛమైన వినోదాన్ని అందించడం ఎంతో కీలకమని తాను గ్రహించినట్లు వివరించారు. త్వరలో విడుదల కానున్న స్పోర్ట్స్ డ్రామా 'బరి' గురించి ప్రస్తావిస్తూ, గతంలో తాను చేసిన 'గని' చిత్రంలో అనేక అంశాలను జోడించడం వల్ల కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే 'బరి' మాత్రం పూర్తి క్రీడా నేపథ్యంతో ఎంతో వాస్తవికంగా ఉంటుందని వరుణ్ తేజ్ భరోసా ఇచ్చారు. ఈ చిత్ర ఆలోచన తన సోదరి నిహారిక నుంచి వచ్చిందని తెలిపారు. దీనితో పాటు, ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఒక రొమాంటిక్ చిత్రానికి అంగీకరించానని, తన వయసుకు తగినట్లుగా ఉండే ఈ ప్రేమకథ విభిన్న శైలిలో ఉంటుందని వెల్లడించారు.

# బెట్టింగ్ యాప్స్ కేసులో ఈడీ ముందుకు



ఈవార్తలు–వినోదవాణి:ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి (ప్రమోషన్‌కు) సంబంధించిన కేసులో అధికారులు ఆమెను ప్రశ్నించారు. ఈడీ బృందం సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించింది. ప్రధానంగా 'జీత్ విన్' లాంటి గేమింగ్ యాప్‌ల ప్రచారంలో ఆమె భాగస్వామ్యంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ ఒప్పందాలకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను పరిశీలించిన అధికారులు... ప్రమోషన్స్ కోసం ఆమె అందుకున్న భారీ పారితోషికం వివరాలు, ఆ నగదు హవాలా మార్గంలో వచ్చిందా లేక బ్యాంకింగ్ లావాదేవీల ద్వారా చెల్లించారా అనే అంశాలపై సుదీర్ఘంగా ప్రశ్నించినట్టు సమాచారం. దేశంలో వేల కోట్ల రూపాయల మనీ లాండరింగ్‌కు పాల్పడుతూ, అక్రమంగా విదేశాలకు నిధులు తరలిస్తున్న బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై ఈడీ ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగానే ఈ యాప్‌లకు ప్రచారకర్తలుగా వ్యవహరించిన సినీ సెలబ్రిటీలు, సోషల్ మీడియా స్టార్లపై ప్రత్యేక దృష్టి పెట్టి వరుసగా నోటీసులు ఇస్తూ విచారిస్తోంది.









# మానవ్.. మాయ!

**యువ స్పిన్నర్ దెబ్బకు లంక చిత్తు.. గాలే టెస్టులో భారత్ ఘన విజయం.. 165 పరుగుల తేడాతో గెలుపు**

**శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 165 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ (6/55) అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగడంతో టీమిండియా మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఖాతాలో 12 కీలక పాయింట్లను జమ చేసుకుంది.**

భారత జట్టుకు ఇది 600వ టెస్టు మ్యాచ్ కావడం, గాలే స్టేడియానికి 50వ టెస్టు కావడం ఈ విజయానికి మరింత ప్రత్యేకతను చేకూర్చింది. ఐదో రోజు ఆటలో భాగంగా రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన శ్రీలంక 77.4 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయింది. లంచ్ విరామం తర్వాత శ్రీలంక బ్యాటర్లు సోనాల్ దినుష, కేశర నువంత కొద్దిసేపు భారత బౌలర్లను నిలువరించారు.

ఈవార్తలు – క్రీడావాణి: ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో రాణించిన దినుష (84) మరోసారి అద్భుతంగా ఆడి, రెండో సెంచరీ దిశగా సాగుతున్నట్లు కనిపించాడు. ఈ దశలో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందేమోననిపించింది. అయితే, యువ కెరటం మానవ్ సుతార్ తన స్పిన్ మాయాజాలంతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. 76వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన సుతార్, ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి శ్రీలంక పతనాన్ని శాసించాడు. ఆ ఓవర్లో దినుషను లెగ్ గల్లీలో ధ్రువ్ జురెల్ క్యాచ్ ద్వారా ఔట్ చేసి కీలక భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాతి బంతికే ప్రభాత్ జయసూర్యను క్లీన్ బౌల్డ్ చేశాడు. హ్యాట్రిక్ బంతిని లహిరు కుమార ఎదుర్కొన్నప్పటికీ, రెండు బంతుల తర్వాత అతనిని కూడా కీపర్ రిషభ్ పంత్ క్యాచ్ ద్వారా పెవిలియన్‌కు పంపాడు. దీంతో తన రెండో టెస్టులోనే రెండోసారి ఐదు వికెట్ల ఘనతను సుతార్ అందుకున్నాడు. ఆ తర్వాత కొద్దిసేపు నువంత (20) పోరాడినా.. 78వ ఓవర్లో అతడిని కూడా బౌల్డ్ చేసిన సుతార్, భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. దీంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ మ్యాచ్‌లో సుతార్ మొత్తం 101 పరుగులిచ్చి 10 వికెట్లు పడగొట్టాడు. భారత్ విజయానికి తొలి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ సాధించిన అద్భుతమైన సెంచరీ (167) బలమైన పునాది వేసింది. అతని ఇన్నింగ్స్ వల్లే భారత్‌కు 178 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ ఆడిన వ్యూహాత్మక ఇన్నింగ్స్ (66) కూడా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ స్కోరుతో భారత్ బౌలర్లు టర్నింగ్ పిచ్‌పై లంక బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టి విజయాన్ని ఖాయం చేశారు.

## మానవ్ సుతార్ 10 వికెట్లు

శ్రీలంక గడ్డపై భారత యువ స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ చారిత్రక ప్రదర్శనతో అదరగొట్టాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి, టీమిండియా దిగ్గజాలు హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్ రికార్డులను అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో 10/131 గణాంకాలతో శ్రీలంకలో ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. లంకలో 10 వికెట్ల ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు.

## భారత క్రికెట్‌ను ఏలుతాడు: గిల్



మానవ్ ఒక అద్భుతమైన స్పిన్నర్. భారత్ తరపున తొలి మ్యాచ్(అఫ్గానిస్తాన్)లోనే తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. ఇప్పుడు ఈ మ్యాచ్‌లో కూడా అసాధరణ ప్రదర్శన కనబరిచాడు. అతడికి మంచి భవిష్యత్తు ఉంది. అతడు కచ్చితంగా భారత జట్టుకు సుదీర్ఘకాలం ప్రాతినిథ్యం వహిస్తాడు. పడిక్కల్ గురుంచి ప్రత్యేకంగా చెప్పాలి. అతడు రెండు ఇన్నింగ్స్‌లలోనూ అత్యుత్తమంగా రాణించాడు. అతడి బ్యాటింగ్ చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం సెంచరీ చేయడమే కాకుండా, ఆ తర్వాత కూడా బాధ్యతాయుతంగా ఆడి జట్టును మంచి పొజిషన్‌లో నిలిపాడు. రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్నర్లను అతడు ఎదుర్కొన్న తీరు, ఆధిపత్యం చెలాయించిన విధానం మ్యాచ్ మొత్తానికే హైలైట్.

**- టీమిండియా కెప్టెన్ గిల్**

## ప్రజ్ఞానంద అదరహో

**సింక్‌ఫీల్డ్ కప్‌లో అదరగొట్టిన గ్రాండ్ మాస్టర్**

ఈవార్తలు – క్రీడావాణి: భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద సింక్‌ఫీల్డ్ కప్‌లో అదరగొట్టాడు. ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్–లాగ్రేవ్‌పై కేవలం 28 ఎత్తుల్లోనే విజయం సాధించి, టోర్నీలో జాయింట్ లీడ్‌లోకి దూసుకెళ్లాడు. ఎనిమిదో, పెనాల్టిమేట్ రౌండ్‌లో లాగ్రేవ్‌ను ఓడించిన ప్రజ్ఞానంద 8 రౌండ్లలో 5 పాయింట్లు సాధించాడు. అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో కూడా 5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ ఫలితంతో ప్రజ్ఞానంద ఈ ఏడాది చివర్లో జరగనున్న గ్రాండ్ ఫైనల్‌కు అర్హత కూడా ఖాయం చేసుకున్నాడు. ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ జవోఖిర్ సిందరోవ్ కూడా అద్భుత ఫామ్‌లోకి వచ్చాడు. డచ్ ఆటగాడు జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌పై విజయం సాధించి వరుసగా మూడో గేమ్ గెలిచాడు. దీంతో సిందరోవ్ 4.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. మరోవైపు జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ టాప్ సీడ్ అమెరికన్ ఫాబియానో కరువానాను ఓడించి 4.5 పాయింట్లతో సిందరోవ్‌తో కలిసి మూడో స్థానాన్ని పంచుకుంటున్నాడు. మరో మ్యాచ్‌లో అమెరికాకు చెందిన లెవోన్ అరోనియన్, నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరి డ్రా చేసుకున్నారు. ఇప్పుడు అందరి దృష్టి చివరి రౌండ్‌పైనే ఉంది. ప్రజ్ఞానంద తెల్ల పావులతో అనిష్ గిరితో తలపడనున్నాడు. మరో కీలక పోరులో సిందరోవ్, వెస్లీ సోను ఎదుర్కోనున్నాడు. ఇక కీమర్.. వాన్ ఫోరెస్ట్‌తో ఆడనున్నాడు.





## కపిల్‌దేవ్ రికార్డు బద్ధలు

**ఇంగ్లండ్ బౌలర్ అరుదైన ఘనత**

ఈవార్తలు – క్రీడావాణి: ఇంగ్లండ్–పాకిస్తాన్ మధ్య తొలి టెస్టు లీడ్స్ వేదికగా ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ కెప్టెన్ జోరూట్ తొలుత పాక్‌ను బ్యాటింగ్ అహ్వానించాడు. అయితే బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్‌కు ఇన్నింగ్స్ ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. మొదటి బంతికే పాక్ ఓపెనర్ అజాన్ అవైస్‌ను ఇంగ్లండ్ స్టార్ పేసర్ ఓలీ రాబిన్సన్ పెవిలియన్‌కు పంపాడు. యువ ఆటగాడు అవైస్‌కు రాబిన్సన్ ఆఫ్ స్టంప్ అవతల గుడ్–లెంగ్త్ డెలివరీ వేశాడు. అయితే బంతి పిచ్ అయిన తర్వాత ఎక్కువగా స్వింగ్ అవుతూ లోపలకు వచ్చి నేరుగా అవైస్ ఫ్రంట్ ప్యాడ్‌ను తాకింది. వెంటనే ఎల్బీకి అప్పీల్ చేయగా అంపైర్ అవుట్ అని వేలు పైకెత్తాడు. బ్యాటర్ రివ్యూ తీసుకున్నప్పటికి అల్ట్రాఎడ్జ్‌లో బంతి బ్యాట్‌ను తాకలేదని స్పష్టమవ్వడంతో అతడు డకౌట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ క్రమంలో రాబిన్సన్స్ ఓ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. ఒక టెస్ట్ మ్యాచ్‌లో మొదటి బంతికే పాక్ బ్యాటర్‌ను అవుట్ చేసిన రెండో బౌలర్‌గా రాబిన్సన్ నిలిచాడు. అంతకుముందు 1983లో జలంధర్ వేదికగా జరిగిన ఓ టెస్టులో పాకిస్తాన్ ఓపెనర్ మొహ్సిన్ ఖాన్‌ను కపిల్ దేవ్ తొలి బంతికే అవుట్ చేశాడు. మళ్లీ ఇప్పుడు 43 ఏళ్ల తర్వాత రాబిన్సన్ ఈ ఫీట్ నమోదు చేయడం విశేషం.

## సిక్సులు కొట్టు.. ఐపీఎల్‌కు తీసుకెళ్తా: జైస్వాల్

ఈవార్తలు – క్రీడావాణి: శ్రీలంకతో తొలి టెస్టు సందర్భంగా టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన చర్యతో వార్తల్లో నిలిచాడు. లంక వికెట్ కీపర్ బ్యాటర్ నిరోషన్ డిక్‌వెల్లాను స్లెడ్జ్ చేసి.. అతడి ఏకాగ్రతను దెబ్బతీయడంలో జైసూ సఫలమయ్యాడు. టీమిండియా బ్యాటింగ్ చేస్తున్నపుడు డిక్‌వెల్లా స్లెడ్జింగ్‌కు పాల్పడగా.. ఐదో రోజు ఆటలో జైస్వాల్ ఈ మేరకు ప్రతీకారం తీర్చుకున్నాడు. అసలేం జరిగిందంటే.. గాలె టెస్టులో టీమిండియా విధించిన 372 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక ఆది నుంచే తడబడింది. ఈ క్రమంలో మంగళవారం నాటి నాలుగు రోజు ఆట ముగిసేసరికి నాలుగు వికెట్లు నష్టపోయి కేవలం 84 పరుగులే చేసింది. అయితే, కెప్టెన్ ధనంజయ డి సిల్వ (59), సొనాల్ దినుష (84) కలిసి స్కోరు బోర్డును ముందుకు నడిపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బుధవారం లంచ్‌కు ముందు రవీంద్ర జడేజా ధనంజయను అవుట్ చేయగా.. అతడి స్థానంలో నిరోషన్ డిక్‌వెల్లా



క్రీజులోకి వచ్చాడు. ఈ క్రమంలో జైస్వాల్ అతడిని స్లెడ్జ్ చేశాడు. లంక రెండో ఇన్నింగ్స్‌లో భారత పేసర్ ప్రసిద్ కృష్ణ 60వ ఓవర్లో బంతితో రంగంలోకి దిగగా.. ఐదో బాల్‌కు డిక్‌వెల్లా రెండు పరుగులు తీశాడు. అప్పుడు స్క్వేర్ లెగ్ ఫీల్డింగ్ పొజిషన్‌లో ఉన్న జైస్వాల్.. డిక్‌వెల్లాను మాటల్లో పెట్టాడు.

జైస్వాల్: కమాన్ యార్.. తొలి ఇన్నింగ్స్‌లో బాగానే షాట్లు కొట్టావు కదా.. ఇప్పుడు కూడా అలాంటిదేదో కావాలి. కమాన్..

డిక్‌వెల్లా: అవునా?

జైస్వాల్: అవును. నువ్వు షాట్లు కొడుతుంటే చూడాలనుకుంటున్నాను. చేసి చూపించు మరి. డీప్ స్క్వేర్ లెగ్ దిశగా సిక్సర్ బాదు.

డిక్‌వెల్లా: ఆ అవసరం ఇప్పుడు లేదు. నన్ను ఐపీఎల్‌కు తీసుకువెళ్లు. అక్కడ సిక్సర్లు బాదుతా.

జైస్వాల్: కచ్చితంగా వంద శాతం తీసుకెళ్తా. ఇప్పుడైతే సిక్సర్ కొట్టు. నిన్ను ఐపీఎల్‌కు తీసుకెళ్తా.

డిక్‌వెల్లా: ధన్యవాదాలు.

**డిక్‌వెల్లా (10)ను జైస్వాల్ స్లెడ్జ్ చేయగా.. మరుసటి బంతికే అతడు వికెట్ కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. ఇక ఈ మ్యాచ్‌లో టీమిండియా 165 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తు చేసి.. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ముందంజ వేసింది. కాగా శ్రీలంకతో తొలి టెస్టులో జైస్వాల్ తొలి ఇన్నింగ్స్‌లో 32 పరుగులు చేసి.. రెండో ఇన్నింగ్స్‌లో డకౌట్ అయ్యాడు.**

## డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు సజీవం

ఈవార్తలు – క్రీడావాణి: శ్రీలంకపై తొలి టెస్టులో 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన భారత్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో తమ పరిస్థితిని మెరుగుపరుచుకుంది. తొలి టెస్టుకు ముందు భారత్ పీసీటీ 48.15%గా ఉండగా, శ్రీలంకపై విజయం తర్వాత అది 53.55%కి పెరిగింది. ్రాజు శాతం పెరిగినప్పటికీ భారత్ ఐదో స్థానంలోనే కొనసాగుతోంది. నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్‌తో భారత్‌కు ఇంకా గణనీయమైన తేడా ఉంది. ఈ సైకిల్‌లో భారత్ ఫైనల్ రేసులో నిలవాలంటే మిగిలిన 8 మ్యాచ్‌ల్లో భారీగా విజయాలు సాధించాల్సి ఉంటుంది. భారత్ తదుపరి శ్రీలంకతో మరో టెస్టు, న్యూజిలాండ్‌తో రెండు టెస్టులు, ఆస్ట్రేలియాతో స్వదేశంలో ఐదు టెస్టులు ఆడాల్సి ఉంది. ఇందులో కనీసం 6 టెస్టులు గెలిస్తే భారత్‌కు ఫైనల్ చేరే అవకాశాలు బలపడతాయి. అది మాత్రమే సరిపోదు. పై స్థానాల్లో ఉన్న జట్లు కూడా పాయింట్లు కోల్పోవాలి. అప్పుడే భారత్ ఫైనల్‌కు చేరుకుంటుంది.

నేటి ఈవార్తలు
సంపాదకీయం
Editorial

# ధిక్కార స్వరం.. రేవంత్‌కు జ్వరం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్న కొద్దీ.. పార్టీలో అంతర్గత అసంతృప్తి స్వరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. మొన్న దానం నాగేందర్.. నిన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. నేడు కొండా సుస్మిత వంటి నేతల వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. వీరి విమర్శలు ఒక్కో సందర్భంలో ఒక్కో అంశంపై ఉన్నప్పటికీ.. అన్నింటినీ కలిపి చూస్తే ఒక విషయం మాత్రం స్పష్టమవుతోంది. పార్టీలో అసంతృప్తి ఉందన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీకి ప్రతిపక్షం నుంచి విమర్శలు రావడం సహజం. కానీ సొంత పార్టీకి చెందిన నేతలే సొంత ప్రభుత్వ పనితీరుపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం మాత్రం పాలకపక్షానికి ఆందోళన కలిగించే పరిణామం. ఎందుకంటే అధికార పార్టీకి ప్రజల్లో వ్యతిరేకత ఉందా లేదా అన్నది ఎన్నికల వరకు మాత్రమే దాచిపెట్టవచ్చు. కానీ పార్టీలోనే నాయకులు అసంతృప్తితో మాట్లాడటం మొదలైతే.. అది ప్రజల్లోకి వెళ్లే రాజకీయ సందేశంగా మారుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ప్రజల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఆరు గ్యారంటీలు, రైతు సంక్షేమం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక భరోసా, ప్రజా పాలన వంటి హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు రెండేళ్ల పాలన తర్వాత ప్రజలు హామీల అమలు, ప్రభుత్వ పనితీరు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. ఈ సమయంలో పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేయడం ప్రభుత్వానికి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. అయితే ప్రతి విమర్శను తిరుగుబాటుగా చూడటం కూడా సరైంది కాదు. ప్రజాప్రతినిధులకు తమ నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే హక్కు ఉంది. అధికార పార్టీ ఎమ్మెల్యే లేదా నాయకుడు ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. అది ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమైన పరిణామమే. సమస్య విమర్శలో లేదు.. విమర్శ చేసే విధానంలో ఉంది. పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలు బహిరంగ వేదికలపైకి వస్తే మాత్రం పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుంది. ముఖ్యంగా ఒకే అంశంపై పదేపదే వేర్వేరు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తే.. అది వ్యక్తిగత అసంతృప్తి కాకుండా సంస్థాగత సమస్యగా ప్రజల్లోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. కాంగ్రెస్ నాయకత్వం ఇప్పుడు దీనినే గమనించాలి. అధికారంలో ఉన్నప్పుడు పదవులు, అధికార సమీకరణాలు, నియోజకవర్గ ప్రాధాన్యత, నిధుల కేటాయింపు, ప్రభుత్వ నిర్ణయాల్లో భాగస్వామ్యం వంటి అంశాలు పార్టీలో అసంతృప్తికి కారణమవుతాయి. ప్రతి నాయకుడి ఆశయాన్ని నెరవేర్చడం సాధ్యం కాదు. కానీ నాయకులతో నిరంతరం మాట్లాడటం, వారి సమస్యలను వినడం, పరిష్కరించగల అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవడం మాత్రం సాధ్యమే. ఇక్కడ ముఖ్యమంత్రి, పార్టీ రాష్ట్ర నాయకత్వం పాత్ర కీలకం. అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రతి నేతను శత్రువుగా చూడటం కంటే.. ఎందుకు అసంతృప్తిగా ఉన్నారో తెలుసుకోవడం ముఖ్యం. విమర్శ వెనుక వ్యక్తిగత ప్రయోజనం ఉందా? నియోజకవర్గ సమస్య ఉందా? పార్టీ నిర్ణయాలపై అభ్యంతరమా? ప్రభుత్వ పనితీరుపై నిజమైన ఆందోళనా? అన్నది విడదీయాలి. ఎందుకంటే ఎన్నికలు ఇంకా దూరంలో ఉన్నాయని భావించి సమస్యలను వాయిదా వేయడం ప్రమాదకరం. రాజకీయాల్లో ప్రజల తీర్పు ఒక్కరోజులో రూపుదిద్దుకోదు. ఎన్నికలకు ఏడాది, రెండేళ్ల ముందు నుంచే ప్రజల మనసుల్లో అభిప్రాయం ఏర్పడుతుంది. అధికార పార్టీ నాయకుల మధ్య విభేదాలు, బహిరంగ విమర్శలు, అసంతృప్తి, వర్గపోరు వంటి అంశాలు ప్రతిపక్షాలకు రాజకీయ ఆయుధాలుగా మారతాయి. సోషల్ మీడియా కాలంలో ఒక నాయకుడి వ్యాఖ్య నిమిషాల్లో లక్షల మందికి చేరుతుంది. ఒకసారి ఏర్పడిన 'పార్టీలో అంతా బాగోలేదు' అన్న భావనను తొలగించడం అంత సులభం కాదు. ఇప్పటికే తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ తిరిగి పుంజుకునే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ కూడా తన స్థాయిని పెంచుకోవాలని చూస్తోంది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి పెరిగితే దాని రాజకీయ లాభం ప్రతిపక్షాలకు దక్కడం ఖాయం. అందుకే కాంగ్రెస్ నాయకత్వానికి ఇప్పుడు అత్యంత అవసరమైనది అంతర్గత సమన్వయం. ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉందా? ఉంటే ఎందుకు? ఏ హామీలు ఆలస్యమవుతున్నాయి? ఏ నియోజకవర్గాలకు నిధులు అందడం లేదు? ఎమ్మెల్యేలు అధికారులను కలవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? పార్టీ కార్యకర్తలకు ప్రభుత్వంలో ప్రాధాన్యం దక్కడం లేదా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. ప్రజాప్రతినిధులను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకునే విధానం మారాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ నాయకత్వం మధ్య నిరంతర సమన్వయం ఉండాలి. నియోజకవర్గాల వారీగా సమస్యలను సమీక్షించే వ్యవస్థ ఉండాలి. ప్రభుత్వం తీసుకునే కీలక నిర్ణయాలను పార్టీ నాయకులకు వివరించాలి. అప్పుడు అపోహలు తగ్గుతాయి. అసంతృప్తి కూడా కొంతవరకు నియంత్రించవచ్చు. అంతేకాదు.. నాయకుల విమర్శల్లో ప్రజా ప్రయోజనం ఉంటే ప్రభుత్వం వాటిని సానుకూలంగా తీసుకోవాలి. సొంత పార్టీ నేత ప్రశ్నిస్తేనే ప్రభుత్వం తన పనితీరును సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది. అంతర్గత ప్రజాస్వామ్యాన్ని బలహీనతగా కాకుండా బలంగా చూడాలి. కానీ మరోవైపు నాయకులు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని బహిరంగంగా విమర్శించడం, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడటం, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం పార్టీకి మాత్రమే కాదు.. తమ రాజకీయ భవిష్యత్తుకూ నష్టం చేస్తుంది. అసమ్మతి ఉండొచ్చు.. కానీ అది పార్టీని బలహీనపరిచే స్థాయికి వెళ్లకూడదు. రాజకీయ పార్టీకి భిన్నాభిప్రాయాలు సహజం. కానీ ఆ భిన్నాభిప్రాయాలను పరిష్కరించే వ్యవస్థ లేకపోతే అవే పగుళ్లుగా మారతాయి. పగుళ్లు పెరిగితే వర్గాలుగా మారతాయి. వర్గాలు బలపడితే ఎన్నికల సమయంలో టికెట్లు, ప్రచారం, ఓట్ల బదిలీ వంటి అంశాలపై ప్రభావం చూపుతాయి. రేపటి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రతిపక్షం కంటే ముందుగా ఎదురయ్యే పరీక్ష ఇదే కావచ్చు. ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయాన్ని మార్చడం కంటే.. సొంత పార్టీలో ఉన్న అసంతృప్తిని చక్కదిద్దడం ఇప్పుడు కాంగ్రెస్‌కు తక్షణ అవసరం. ఎందుకంటే ఎన్నికల యుద్ధం పోలింగ్ కేంద్రంలో మొదలుకాదు. అది చాలా ముందుగానే పార్టీల కార్యాలయాల్లో, నాయకుల సమావేశాల్లో, కార్యకర్తల మనసుల్లో మొదలవుతుంది. ఇప్పుడు వినిపిస్తున్న అసంతృప్తి స్వరాలు చిన్న చినుకులే కావచ్చు. కానీ వాటిని పట్టించుకోకపోతే అవే రేపు రాజకీయ తుపానుగా మారే ప్రమాదం ఉంది. అధికారంలో ఉన్న పార్టీకి ప్రజల విమర్శలు ఒక హెచ్చరిక అయితే.. సొంత పార్టీ నేతల విమర్శలు అంతకంటే పెద్ద హెచ్చరిక. తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఈ సంకేతాలను ఇప్పుడే చదవాలి. అసంతృప్తిని అణచివేయడం కాదు.. దాని మూలాలను పరిష్కరించాలి. నేతలను దూరం చేయడం కాదు.. దగ్గర చేసుకోవాలి. విమర్శలను శత్రుత్వంగా చూడడం కాదు.. వాటిలోని వాస్తవాన్ని గుర్తించాలి. లేకపోతే 'మొన్న దానం.. నిన్న పోచారం.. నేడు కొండా.. రేపు ఎవరు?' అన్న ప్రశ్నే కాంగ్రెస్‌కు రాజకీయ సమస్యగా మారుతుంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. కానీ అసంతృప్తి మంటలు ఆర్పడానికి సమయం ఇప్పుడే.

---

## గైడ్.. చరిత్రకు వెలుగుదీపం

రాజుల కాలం వెతుకుతూ,
శిల్పాల నిశ్శబ్దంలో
చరిత్ర స్వరాన్ని వినిపిస్తూ..
ఇది ఎవరు కట్టారు,ఎప్పుడు నిర్మించారు
అనే మన ప్రశ్నల వర్షాలకి..
సమాధానాల దీపమై నిలుస్తాడు గైడ్..!

చరిత్రను రాజులు సృష్టించి ఉండొచ్చు..
కానీ ఆ చరిత్రకు మళ్లీ మళ్లీ ఊపిరి పోసేది
అతని లాంటి గొంతులే..
అతను కేవలం గైడ్ కాదు..
కాలం మూసిన తలుపులకు
తాళం తీసే మనిషి...
మౌనంగా ఉన్న రాళ్లకు
మాటలు నేర్పే మనిషి....
మరచిపోతున్న తరాలకు
గతాన్ని పరిచయం చేసే మనిషి...
చరిత్ర పుటల్లో అతని పేరు లేకపోవచ్చు..
కానీ ఆ పుటలు తెరుచుకున్న ప్రతిసారీ
వినిపించే స్వరాల్లో
అతని గొంతు తప్పక ఉంటుంది, అతనే గైడ్..!

ఎండ మండినా, వాన కురిసినా..
ఇంట్లో పిల్లలు ఆకలి కేకలతో అలమటిస్తున్నా..
వచ్చిన సందర్శకులకు చిరు నవ్వుతో
రాజుల వైభవం వారి చరిత్ర చెబుతు
తన కళ్లలో కన్నీళ్లు దాచుకుని
వారి కళ్లలో ఆశ్చర్యాన్ని నింపుతాడు..!

తన జీవితంలో లేని సౌభాగ్యాన్ని
చరిత్రలోని రాజుల జీవితాలుగా
ఇతరులకు చూపిస్తాడు..!

చరిత్ర పుస్తకాల్లో లేకపోవచ్చు..
కానీ అతని గొంతు లేకపోతే
ఆ చరిత్రకు ప్రాణం ఉండదు అని గుర్తుంచుకో..!

అతని అడుగులు ఆగిపోతే
ఒక కథ ఆగిపోతుంది..
అతని గొంతు మూగబోతే
ఒక చరిత్ర మూగబోతుంది..
అతని జ్ఞాపకం చెరిగిపోతే
ఒక తరం తన గతాన్ని కోల్పోతుంది,
కాబట్టి..
రాజులను గుర్తుపెట్టుకునే ముందు
వారి కథలు చెప్పే ఈ మనుషులను గుర్తుపెట్టుకో..!

కోటలను చూసి ఆశ్చర్యపడే ముందు
ఆ కోటల చరిత్రను
మన కళ్లకు చూపించే ఆ గొంతును గౌరవించు..!

తన గుడిసెలో వెలుగు తక్కువైనా
గత చరిత్ర వైభవాన్ని
వేలాది మనసుల్లో వెలిగించే
ఆ గొంతును గౌరవించు..!

వారికి మంచి రోజులు రావాలని కోరుకుంటూ..
మనం రాజుల కోటలను, దేవాలయాలను
చూడడానికి వాటి చరిత్ర తెలుసుకోవడానికి,
ఖర్చులకు భయపడకుండా ఎంతో దూరం నుండి వస్తాం..
గైడ్ చెప్పింది విని అతను సంతోష పడేవిధంగా డబ్బులు ఇద్దాం.



మంజుల పత్తిపాటి (కవయిత్రి )
ఫోన్ నంబర్: 9347042218
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా

---

# పరిమితుల వలలో వ్యక్తిగత స్వేచ్ఛ

**డిజిటల్ ప్రపంచం మనిషి జీవితాన్ని సులభతరం చేసింది. బ్యాంకింగ్ నుంచి వ్యాపారం వరకు, విద్య నుంచి సమాచార ప్రసారం వరకు ప్రతి రంగంలోనూ సాంకేతికత కీలకంగా మారింది. కానీ అదే డిజిటల్ ప్రపంచంలో వ్యక్తి ఏం చేయాలి, ఎంత లావాదేవీ చేయాలి, ఎన్ని సిమ్‌లు కలిగి ఉండాలి, సోషల్ మీడియాలో ఎంత మాట్లాడాలి అనే దానిపై వరుసగా పరిమితులు పెడితే.. అది భద్రత పేరుతో స్వేచ్ఛను క్రమంగా కుదించే ప్రమాదం ఉంది. ఒకప్పుడు డబ్బును చేతిలో పెట్టుకుని తిరిగేవాళ్లం. ఇప్పుడు ఫోన్‌లోనే బ్యాంకు ఉంది. ఒకప్పుడు ఉత్తరం రాసి అభిప్రాయం చెప్పేవాళ్లం. ఇప్పుడు క్షణాల్లో సోషల్ మీడియాలో ప్రపంచానికి చెప్పగలుగుతున్నాం. ఒకప్పుడు ఒక వ్యక్తికి ఒక ఫోన్ నంబర్ ఉండేది.**

ఇప్పుడు వ్యక్తిగతం, వ్యాపారం, ఉద్యోగం, కుటుంబం, సంస్థలు, పరికరాలు.. అవసరాన్ని బట్టి అనేక కనెక్షన్లు ఉండవచ్చు. సాంకేతికత మారినప్పుడు మన జీవన విధానమూ మారింది. కానీ నియంత్రణ విధానాలు మాత్రం చాలా సందర్భాల్లో పాత ఆలోచనలతోనే కొనసాగుతున్నాయి. డిజిటల్ లావాదేవీలపై పరిమితులు, సోషల్ మీడియా పోస్టులపై నియంత్రణ, ఒక వ్యక్తి ఎన్ని సిమ్ కార్డులు కలిగి ఉండాలన్న దానిపై సంఖ్యా పరిమితులు.. ఇవన్నీ ఒక్కొక్కటిగా చూస్తే భద్రత కోసం తీసుకునే చర్యలుగా కనిపించవచ్చు. మోసాలు, సైబర్ నేరాలు, అక్రమ లావాదేవీలు, నకిలీ ఖాతాలు, డిజిటల్ మోసాలను అరికట్టడం ప్రభుత్వ బాధ్యతే. కానీ కొంతమంది నేరస్థులు దుర్వినియోగం చేస్తున్నారని మొత్తం సమాజాన్నీ అనుమానితులుగా చూడటం ఎంతవరకు సమంజసం? ఇదే అసలు ప్రశ్న.



డిజిటల్ లావాదేవీలను ఉదాహరణగా తీసుకుందాం. ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. చిన్న వ్యాపారి నుంచి పెద్ద సంస్థ వరకు నగదు రహిత లావాదేవీలపై ఆధారపడుతున్నారు. ఒక వ్యాపారి రోజులో పెద్ద మొత్తంలో చెల్లింపులు స్వీకరించవచ్చు. ఒక సంస్థకు వందలాది లావాదేవీలు ఉండవచ్చు. ఒక వ్యక్తి ఆస్తి కొనుగోలు, విద్యా రుసుము, వైద్య ఖర్చులు, వ్యాపార చెల్లింపులు వంటి సందర్భాల్లో ఒక్కసారిగా భారీ మొత్తాన్ని బదిలీ చేయాల్సి రావచ్చు. అందరికీ ఒకే పరిమితి విధిస్తే అది ఆర్థిక స్వేచ్ఛను ప్రభావితం చేసే అవకాశం ఉంది. నేరాన్ని అరికట్టాలంటే లావాదేవీ మొత్తాన్ని మాత్రమే చూడకూడదు.. లావాదేవీ స్వభావాన్ని చూడాలి. అనుమానాస్పద లావాదేవీలను కృత్రిమ మేధ, ప్రవర్తనా విశ్లేషణ, ప్రమాద ఆధారిత పర్యవేక్షణ ద్వారా గుర్తించవచ్చు. నిజాయితీగా లావాదేవీలు చేసే కోట్లాది మందిని పరిమితుల్లో బంధించడం కంటే నేరపూరిత కార్యకలాపాలను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి అనుకూలమైన మార్గం. సోషల్ మీడియా విషయంలోనూ ఇదే సూత్రం వర్తించాలి. తప్పుడు సమాచారం, ద్వేషపూరిత ప్రసంగం, మోసపూరిత ప్రకటనలు, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు వంటి వాటిపై చర్యలు తీసుకోవాలి. కానీ ప్రభుత్వాన్ని విమర్శించడం, విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం కూడా నేరంగా మారే పరిస్థితి మాత్రం ప్రమాదకరం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి ప్రశ్నలు అడగడం పౌరుడి హక్కు. ఒక ప్రభుత్వ నిర్ణయం నచ్చకపోతే దాన్ని విమర్శించే హక్కు ఉండాలి. అధికారంలో ఉన్నవారిపై విమర్శలు రావడం ప్రజాస్వామ్య బలహీనత కాదు.. ప్రజాస్వామ్యం పనిచేస్తోందనడానికి అది ఒక సంకేతం. సోషల్ మీడియా పోస్టులపై పరిమితులు విధించేటప్పుడు అందుకే అత్యంత జాగ్రత్త అవసరం. 'అపసమాచారం' పేరుతో అసమ్మతిని అణచివేసే అవకాశం ఉండకూడదు. ఏది నేరం? ఏది విమర్శ? ఏది వ్యంగ్యం? ఏది అభిప్రాయం? అన్నది స్పష్టమైన చట్టపరమైన ప్రమాణాలతో నిర్ణయించాలి. అధికారుల అభీష్టం ఆధారంగా ఒక పోస్టును తొలగించే వ్యవస్థ ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారవచ్చు. ఇక సిమ్ కార్డుల విషయానికి వస్తే.. ఒక వ్యక్తి తొమ్మిదికి మించి సిమ్‌లు ఎందుకు కలిగి ఉండాలి? అన్న ప్రశ్న సహజంగానే రావచ్చు. కానీ ప్రతి వ్యక్తి అవసరం ఒకేలా ఉండదు. కొందరికి వ్యక్తిగత నంబర్ ఉండొచ్చు. వ్యాపారానికి వేరు నంబర్ ఉండొచ్చు. సంస్థల పనుల్లో అనేక కనెక్షన్లు అవసరం కావచ్చు. కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న కనెక్షన్ల నిర్వహణలోనూ వేర్వేరు పరిస్థితులు ఉండవచ్చు. అందువల్ల సంఖ్యను మాత్రమే నేరానికి ప్రమాణంగా చూడటం సరైన పద్ధతి కాదు. ఒక వ్యక్తి 10 సిమ్‌లు కలిగి ఉన్నాడని అతను నేరస్థుడు అయిపోడు. అదే సమయంలో ఒకే సిమ్‌తోనూ భారీ సైబర్ నేరం చేయవచ్చు. కాబట్టి సంఖ్య ఆధారిత నియంత్రణ కంటే వినియోగ విధానాన్ని, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం సమర్థవంతమైన మార్గం.

ఇక్కడ ప్రభుత్వం ఒక విషయం గుర్తుంచుకోవాలి. భద్రత కోసం రూపొందించే ప్రతి నియమం చివరికి పౌరుడి స్వేచ్ఛను ఎంతవరకు ప్రభావితం చేస్తుందో కూడా కొలవాలి. సైబర్ నేరాలను అరికట్టాలి. కానీ పౌరులపై నిఘా పెంచడం ఒక్కటే పరిష్కారం కాదు. ఆర్థిక మోసాలను ఆపాలి. కానీ ప్రతి పెద్ద లావాదేవీని అనుమానించడం పరిష్కారం కాదు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టాలి. కానీ ప్రతి విమర్శను నియంత్రించడం పరిష్కారం కాదు. నేరస్థుడిని పట్టుకోవడానికి నిర్మించిన వలలో సామాన్య పౌరుడు చిక్కుకోకూడదు. అత్యంత ముఖ్యమైనది పారదర్శకత. ప్రభుత్వం ఏ పరిమితి విధించినా దానికి స్పష్టమైన కారణం చెప్పాలి. ఆ పరిమితి ఎందుకు అవసరమో ప్రజలకు వివరించాలి. దాని ప్రభావాన్ని కాలానుగుణంగా సమీక్షించాలి. అవసరం లేని నియంత్రణను తొలగించాలి. పౌరుడికి అప్పీల్ చేసుకునే అవకాశం ఉండాలి. స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలి. లేకపోతే ఒకసారి ఏర్పడిన పరిమితి శాశ్వత నియంత్రణగా మారే ప్రమాదం ఉంది. డిజిటల్ యుగంలో మనిషి స్వేచ్ఛకు మరో కోణం కూడా ఉంది.. డేటా స్వేచ్ఛ. మనం ఎక్కడికి వెళ్తున్నాం, ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం కొనుగోలు చేస్తున్నాం, ఏం చదువుతున్నాం, ఏ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాం అనే సమాచారం మొత్తం డిజిటల్ రూపంలో నమోదవుతోంది. ఈ డేటా ఎవరి చేతుల్లో ఉంది? దాన్ని ఎందుకు ఉపయోగిస్తున్నారు? ఎంతకాలం నిల్వ చేస్తున్నారు? ఎవరితో పంచుకుంటున్నారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం. ప్రభుత్వానికి భద్రత అవసరం. పౌరుడికి గోప్యత అవసరం. ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛ అవసరం. ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛా భావవ్యక్తీకరణ అవసరం. వీటన్నింటి మధ్య సమతుల్యత సాధించడమే ఆధునిక పాలనకు అసలు పరీక్ష. నియంత్రణ అవసరం లేదని చెప్పడం అమాయకత్వం. కానీ నియంత్రణకు హద్దులు ఉండాలని చెప్పడం ప్రజాస్వామ్య బాధ్యత. డిజిటల్ ప్రపంచాన్ని నేరస్థుల కోసం స్వేచ్ఛా ప్రదేశంగా వదిలేయకూడదు. అదే సమయంలో పౌరుల కోసం నియంత్రణల జైలుగా మార్చకూడదు. సాంకేతికత మనిషి కోసం ఉండాలి.. మనిషి సాంకేతిక నియంత్రణకు బానిస కాకూడదు. ఈరోజు డిజిటల్ లావాదేవీకి పరిమితి. రేపు సోషల్ మీడియా పోస్టుకు పరిమితి. ఎల్లుండి ఎన్ని ఫోన్లు వాడాలి, ఎన్ని ఖాతాలు ఉండాలి, ఏ సమాచారం చూడాలి అన్నదానిపైనా పరిమితులు రావచ్చు. ప్రతి చిన్న నియంత్రణను 'భద్రత' పేరుతో అంగీకరిస్తూ పోతే.. ఒకరోజు మనకు తెలియకుండానే వ్యక్తిగత స్వేచ్ఛ పరిధి చాలా చిన్నదైపోవచ్చు. అందుకే ప్రభుత్వాలు నేరాన్ని లక్ష్యంగా చేసుకోవాలి.. పౌరుడిని కాదు. డిజిటల్ భద్రత కావాలి.. కానీ డిజిటల్ బానిసత్వం కాదు. నియంత్రణ కావాలి.. కానీ స్వేచ్ఛను మింగేసే నియంత్రణ కాదు. భద్రత కావాలి.. కానీ వ్యక్తిగత గోప్యతను బలి తీసుకునే భద్రత కాదు. డిజిటల్ యుగంలో నిజమైన అభివృద్ధి అంటే కేవలం వేగవంతమైన ఇంటర్నెట్, నగదు రహిత చెల్లింపులు, స్మార్ట్ ఫోన్లు కాదు. సాంకేతికంగా శక్తిమంతమైన పౌరుడికి అదే స్థాయిలో హక్కులు, గోప్యత, స్వేచ్ఛను హామీ ఇవ్వడం. అదే ప్రజాస్వామ్య డిజిటల్ భవిష్యత్తుకు అసలు కొలమానం.



వినోద్ కుమార్
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.